

# కళా, సాహితీ, సంస్కరణ, రాజకీయ ప్రతిభావంతుల్నీ అందించిన ఉభయ గోదావరి జిల్లాలు

రాజమహేంద్రవరం అనగానే రాజరాజనరేంద్రుడనే చక్రవర్తి గుర్తుకువస్తాడు. మహాభారతం ఆంధ్రానువాదం ప్రారంభింప చేయించిన సారస్వతీ సార్వభౌముడు. సమర్థుడైన రాజు సమర్థులైనవారికి బాధ్యతల్ని అప్పగిస్తారనడానికి నిదర్శనంగా, ఆయన ఉభయకవినన్నయ్య భట్టారకునికా బాధ్యతల్ని అప్పగించారు. సంస్కృతాంధ్ర భాషల్లో నిష్ణాతుడైన నన్నయ్యగారు – రెండు భాషలకూ న్యాయం కలుగచేసే పదాల్ను సౌరభింపచేస్తూ నన్నయ్యగారు – ఆది, సభా పర్వములనూ అరణ్యపర్వంలోని కొంత భాగాన్ని అనువదించి తనదైన భాషా శైలికి ఆద్యుడనిపించారు.

నన్నయ్యగారు ప్రారంభించిన మహాభారత ఆంధ్రానువాదాన్ని తిక్కనగారూ, ఎర్రాప్రెగడవారు తమ దైన ప్రత్యేశైలిలో శేషించిన 15న్నర పర్వాలను తెనిగించారు.

నన్నయ్యగారు నాటిన సాహిత్య విత్తుల ప్రభావమేమోగానీ, రాజమహేంద్రవరంలో అనేకమంది సాహితీవేత్తలు అక్కణ్ణుంచే తమ కావ్య రచనాలు ప్రారంభం చేసారు. వచన ప్రబంధాలకూ జనన కేంద్రంగా రూపొందించారంటే గోదావరీ జల ప్రవాహ మహాత్యమే కారణం.

రాజమహేంద్రవరం నుంచే గోదావరి సప్త ప్రవాహ వాహికయింది. వాటిని ఇప్పటికీ సప్త ఋషుల పేర్లతో పిలుస్తున్నారు.

సప్త ఋషుల్లానే ఎంతోమంది సాహితీపరులు, కళామూర్తులు గోదావరి తీరం నుంచే పుట్టారు.

తిరుపతి వేంకటకవుల గురువులు కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిగారు ఇక్కడివారే! ఆయనే ఆంధ్ర రాష్ట్రప్రభుత్వ తొలి ఆస్థానకవి. అలా ఆస్థాన కవిని నియమించే సాంప్రదాయం యెప్పుడో పోయింది.

గొప్ప గొప్ప రచయితలు, పత్రికా రచయితలు ఉభయ గోదావరి జిల్లాల్లోనే జన్మించారు.

గోదావరి, ప్రజాపత్రిక సంపాదకునిగా పేరొందిన క్రొవ్విడి లింగరాజుగారు ఇక్కడివారే! పత్రికలకు సాహిత్యానికి పట్టుగొమ్మగా నిలిచిన అద్దేపల్లి నాగేశ్వరరావుగారు రాజమహేంద్రవరం వారే!

ఆ రోజుల్లో తెలుగు సినిమా 'సీతారామకల్యాణం' నిర్మించిన నిడమర్తివారూ అక్కడివారే! ఆ వంశానికి ఆ ఖ్యాతి దక్కుతుంది. ఇక్కడి నుంచే నవలా రచయిత జంపన చంద్రశేఖరరావు సినిమా జీవితం ప్రారంభమైంది.





## -ఎందరు ప్రముఖులో! ఎందరు ప్రతిభావంతులో! కలానికి అందినవారందర్నీ బంతిపూల దండగా గుచ్చాము!-








ఈ కలానికందని కలం సామ్రాట్‌లెందరో, కళా సామ్రాట్‌లెందరో, కళా సాహితీ రంగాలను పునీతం చేసారు.

రైల్వే నవలా సాహిత్యపు పుట్టుకా, ప్రస్థానం ఇక్కడ నుంచే జరిగింది. కొవ్వలి, జంపన, మానాపురం వంటి నవలా రచయితలు యిక్కడ నుంచే వెలుగులోకి వచ్చారు.

కళ, నాటకం, సాహిత్యం, చిత్రకళ, ఇతిహాస రచనం ఆదిగా గల అష్టాదశ విద్యలూ ఇక్కణ్ణుంచే ప్రభవించాయ్.

సినిమాతారలు ఒకరు తూర్పుగోదావరి జిల్లాలో జన్మిస్తే.. మరొకరు పశ్చిమ గోదావరి జిల్లాలో జన్మించారు..ఎలాగో వారిద్దరూ కలిసి నటించిన సినిమాలెన్నో చరిత్రలో నిలిచిపోయాయ్. వారే వీరు... రేలంగి – సూర్యకాంతం!

### నాటి వెండితెరపై నవ్వులు పండించిన జంట

**(భార్యభర్తలు సినిమాలో వీరి జంట డైలాగ్ ఇది)**

**రేలంగి :** ఏమేవ్! నీ మొగుడ్నే... నా మాటే విననంటావ్!

**సూర్యకాంతం :** మేనత్త కొడుకు... ఓ మొగుడు మొగుడేనా;

పాతతరం సినిమా ప్రేక్షకులకు సూర్యకాంతం, రేలంగి జంట పేర్లు వింటేనే మనస్సు ఉల్లాసపడుతుంది. ఈ జంట నటించిన పాత సినిమాలన్నీ ప్రేక్షకులకు ఎంతగానో నచ్చేయ్. ఎందుకంటే గయ్యాళి భార్యగా సూర్యకాంతం. అమాయకపు భర్తగా రేలంగి వెంకట్రామయ్య నటన బాగా పండేది. తూర్పున కాకినాడకు చెందిన సూర్యకాంతం, పశ్చిమాన తాడేపల్లిగూడెంకు చెందిన రేలంగి, ఈ ఇద్దరు పాతతరం సినిమాల్లో 40 ఏళ్లపాటు ప్రేక్షకులను అలరించారు.

సంసారాల్లో చిచ్చు రేపే పాత్రలు, భర్తను అదుపులో ఉంచుకునే గడసరి ఇల్లాలు. గయ్యాళి అత్త పాత్రలకు ఆమె మారుపేరు. అమ్మో సూర్యకాంతం అని పిలిచే పాత్రల్ను పోషించారామె. అనేక సినిమాల్లో రేలంగిని నిత్యం వేధిస్తూ కొంగున ముడేసుకునే పాత్రలు పోషించారు.

### సీరియస్ విలన్.. కామెడి అసిస్టెంట్! రావుగోపాలరావు - అల్లు రామలింగయ్య

అల్లు : ఏమిటీ మేడపైన ఏవో పాటలు వినిపిస్తున్నాయి.

రావు : నువ్వెందుకొచ్చావురా! వెళ్లు! వెళ్ళు! ముందెల్లిపో..

అల్లు : మీ మొఖం చూస్తుంటే... మీ విషయమేదో విశాఖపట్నం సంతయి పోయినట్టుంది..

రావు : ఒరేయ్! నువ్వర్జెంట్‌గా ఎళ్లకపోతే.. గేటు లేని రైల్లు పట్టాల దగ్గర నిన్ను పడుకోబెట్టేత్తాను... ముందెల్లిపో..

రావుగోపాలరావు, అల్లు రామలింగయ్య జంట... సృష్టించిన డైలాగుల పంట అలజడి. ఆ రోజుల్లో ఒక సెన్సేషన్. ఎన్ని సినిమాల్లో వారు నటించినా ప్రేక్షకులకు విసుగు పుట్టించలేదు. వారు తెరపై కనిపించగానే ప్రేక్షకుల్లో నవ్వులు పువ్వులై విరిసేవి. 90వ దశకం వరకు తెలుగుతెరపై రావుగోపాలరావు విలనిజం, ఆయన సంభాషణా చాతుర్యం, అతనికి సహాయంగా ఉంటూ అతడినే దెప్పిపొడుస్తూ చక్కటి హాస్యాన్ని పండించే అల్లు రామలింగయ్య ద్వయాన్ని ప్రేక్షకులు ఎన్నటికీ మరచిపోలేరు.

రావుగోపాలరావుది గోదావరి అవతల కాకినాడ అయితే, గోదావరి ఇవతల పాలకొల్లు అల్లురామలింగయ్యది. వీరిద్దరూ జంటగా నటించిన సినిమాలు ఎన్నో శతదినోత్సవాలు చేసుకున్నాయి. రావుగోపాలరావు 1937 జనవరి 14న కాకినాడలో జన్మించారు. అక్కడ యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్‌లో సభ్యుడిగా ఉంటూ ఆ వేదిక ద్వారా సినిమా రంగంలోకి ప్రవేశించారు. అల్లు రామలింగయ్య 1922లో పాలకొల్లులో జన్మించారు. హోమియో వైద్యం ఆయనకెంతో ఇష్టం. ఆయన కూడా 1950 ప్రాంతంలో నాటకరంగం నుంచే డా॥ రాజారావుగారి పుట్టిల్లు చిత్రంతో సినిమా రంగంలో అడుగుపెట్టారు.

### కందుకూరి (ఈస్ట్)... చిలకమర్తి (వెస్ట్)

నవ్యాంధ్ర చరిత్రలో అనేక సంస్కరణలకు నాందీ ప్రస్థానం కందుకూరి వీరేశలింగం పేరుతోనే మొదలవుతుంది. వీరు 1848లో జన్మించారు. కోరంగిలో ఇంగ్లీషు స్కూలులో ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగం చేసిన తర్వాత సంఘసంస్కరణల వైపు మొగ్గుచూపారు. మూఢనమ్మకాలు, ఆచారాలు, సంఘంలోని దుశ్చర్యలపై పోరాడారు. రాజమండ్రిలో 1881 డిసెంబర్ 11న 22 ఏళ్ల గోకులపాటి శ్రీరాములు, 12 ఏళ్ల గౌరమ్మ (బాలవితంతువు) కు పెళ్లి జరిపించారు. ఈ వివాహాన్ని ఆపడానికి, పెళ్లికూతురును ఎత్తుకు పోవడానికి, వీరేశలింగంపై దాడి చేయడానికి ఇరువర్గాలవారూ ప్రయత్నించారు. విద్యార్థుల సహకారంతో పెళ్లి సజావుగా జరిగింది. రాజమండ్రికి బయట మొదటి వితంతు వివాహం మద్రాసులో 1883 జూన్ 7న జరిగింది. దీంతో వీరేశలింగం పేరు దక్షిణ భారతదేశం అంతటా వ్యాపించింది. 1897లో మద్రాసు బ్రహ్మసమాజం హాలులో సరోజినీ దేవి, డాక్టర్ గోవిందరాజుల నాయుడు కులాంతరం, భాషాంతర వివాహం జరిగింది. 1905లో హితకారిణీ సమాజాన్ని రాజమండ్రిలో స్థాపించి, తన ఆస్తిని రాసిచ్చిన మహనీయుడు.

## ప్రపంచంలోని ప్రముఖాంధ్ర తెలుగువారందరికీ ఎలా కృతజ్ఞతలు తెలుపాలో తెలియడం లేదు.

ఏ ఒక్క అభిమాని భగవంతునికి పాద పూజ చేసిన ఫలితమో! ఎవరు జ్ఞాపకం చేస్తూ సాలుసరి సహాయములు చేస్తున్నారో- వారికీ- ప్రముఖాంధ్రను Sponsor చేస్తున్న ధర్మాత్ములకు చేయెత్తి నమస్కరిస్తున్నాం.

21 సంవత్సరాలుగా 'ప్రముఖాంధ్ర'ను ఉచితంగా (తపాల రవాణా ఖర్చులతో) ఆనందం చిందుతున్నారో - వారికి కూడా మా వందనములు. కొంతమంది ఉచితంగా 'ప్రముఖాంధ్ర' అందుకుంటూ సంతోషంతో చెప్పరు. ఆ పక్కింటివారు 'ప్రముఖాంధ్ర'ను చదువుతూ ఆనందం వ్యక్తీకరిస్తారు. వారికీ వందనములు.

ఇరవైయొక్క సంవత్సరాలు ప్రముఖాంధ్రను అందుకుంటున్నవారు ఎంతో కొంత మొత్తములనైనా పంపితే మరీ మరీ సంతోషిస్తాం.

(15వ పేజీ తరువాయి) కవిగా, సంస్కరణ వేత్తగా, పత్రిక రచయితగా నూరేళ్ల కిందటే కవిగా పేరు ప్రఖ్యాతులు పొందిన కందుకూరి వీరేశలింగం పంతులు తర్వాత, జాతీయకవిగా పేరు పొందిన చిలకమర్తి లక్ష్మి నరసింహం పంతులుగారు గోదావరితీరాన్ని సుసంపన్నం చేసారు. 1867లో చిలకమర్తి జన్మించారు. ఆయనది వీరవాసరం. చిన్నతనం నుంచి సాహితీ రంగంపై మక్కువ చూపేవారు. కీచకవధ, సౌందర్యతిలకం, నీలచరిత్ర, పారిజాతాపహరణం, మార్కండేయ పురాణం రాశారు. కొంతకాలం ఆయన కలకత్తాలో ఉన్నారు. రాజమండ్రి వచ్చాక ఆర్యసమాజ బోధకుడు పండిత శివనాథశాస్త్రితో పరిచయం కలిగింది. ఆ సమయంలోనే రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగంతో సాన్నిహిత్యం ఏర్పడింది. కందుకూరి స్థాపించిన హితకారిణి సమాజానికి ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. ఆయన రచించిన గయోపాఖ్యానం నాటకం వేల ప్రదర్శనలు జరిగింది, లక్షల పుస్తకాలు అమ్ముడయ్యాయి.

### తిరుపతి వేంకటకవులు : ఆనాటి పాపులర్ పద్యాలన్నీ వీళ్లవే

'జెండాపై కపిరాజు..
బావా! ఎప్పుడు వచ్చితీవు?
చెల్లియో చెల్లకో, అదిగో ద్వారకా

పాండవోద్యోగ విజయంలోని ప్రత్యేక పద్యాల్ను సామాన్యుల సైతం అలవోకగా పలికేలా, ఆలపించేలా రాసిన ఘనత తిరుపతి వేంకటకవులదే! అవధానులుగా, కథకులుగా, నాటక రచయితలుగా,కవులుగా ఇలా ఇలాతెలుగు సాహితీవనంలో బహుముఖ ప్రజ్ఞాశాలురుగా పేరొందారు. ఉభయగోదావరి జిల్లాలకు చెందిన వీరిద్దరు ఒక గురువు వద్ద చదువుకున్నారు. వారిలో ఒకరు తూర్పుగోదావరి జిల్లా కడియంకు చెందిన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, రెండోవారు పశ్చిమగోదావరి జిల్లా యండగండికి చెందిన దివాకర్ల తిరుపతి శాస్త్రి. వీరిద్దరు తాడేపల్లిగూడెం మండలంలో చెర్ల బ్రహ్మయ్యశాస్త్రి వద్ద శిష్యరికం చేస్తూ విద్య నేర్చుకున్నారు. వీరిద్దరు కలిసి తిరుపతి వేంకటకవులుగా పేరుపొందారు. సాహితీ కథన రంగంలో ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించారు. అనేక నాటకాలు రచించారు. వీరి రచనల ద్వారానే ఆంధ్రప్రదేశ్‌లో మహాభారత సంఘటనలు ప్రజలకు సుపరిచితమయ్యాయి. మృచ్ఛకటికం, ప్రభావతి ప్రద్యుమ్నం, చంద్రప్రభ చరిత్ర, పాండవరాజసూయం, బాల రామాయణం, ఎన్నో రచనలు అలవోకగా రచించారు. విశ్వనాథ సత్యానారాయణ, గుర్రం జాషువా, త్రిపురనేని రామస్వామి చౌదరి, దువ్వూరి సుబ్బమ్మ, బులుసు సాంభమూర్తి, వేటూరి, పింగళి వంటివారు ఎంతోమంది వీరివద్ద శిష్యరికం చేశారు. చెళ్లపిళ్ల కంటే 30 ఏళ్లు ముందుగానే తిరుపతిశాస్త్రి పరమపదించినప్పటికీనీ, తర్వాత కాలంలో చెళ్ళపిళ్ల తాను చేసిన రచనలన్నింటికీ తిరుపతి వేంకటకవులు నామంతోనే రచనలు చేయడం వీరిద్దరి సమున్నత స్నేహతత్పరితకు తార్కాణం.

### బాపు - రమణీయం

వీరి స్నేహాన్ని పెంచినది గోదావరే!

తెలుగు సినిమా రంగంలో, సాహితీరంగంలో బాపురమణల పేరు అజరామరం. ఆ రెండు పేర్లు గుర్తొస్తే చాలు గోదావరిస్ఫురణకు వస్తుంది. గోదావరికి అటూ, ఇటూ పుట్టిన ముళ్లపూడి వెంకటరమణ,సత్తిరాజు లక్ష్మీనారాయణ అనే బాపులు వెండి తెరను సుసంపన్నం చేశారు. ఇద్దరిదీ విడదీయరాని బంధం. హైస్కూల్ విద్య నుంచి మిత్రులైన బాపురమణలు చివరి వరకూ కలిసే ఉన్నారు. ముందుగా మరణించిన ముళ్లపూడి వెంకటరమణ లోటుతో బాపు అలసిపోయారు. తన సగం ప్రాణం పోయిందన్నారు. అంతటి అవినాభావ సంబంధం ఉన్న బాపు రమణలు గోదావరి తీరానికి అటు, ఇటూ గట్టి వారధిలా నిలిచారు. బాపుకు తెలిసినవి బొమ్మలు గీయడం, సినిమాలు తీయడం. ఆదే ఆయనకు పద్మశ్రీ వరింపచేసింది.

బాపు అసలు పేరు సత్తిరాజు లక్ష్మీనారాయణ. 1933 డిసెంబర్ 15న నరసాపురంలో జన్మించారు. ఆయన మద్రాసు పిఎస్ హైస్కూలులో విద్యాభ్యాసం చేశారు. ముళ్లపూడి వెంకటరమణ ఆయనకు బాల్యమిత్రుడు. బాల్యం నుంచి చిత్రాలు వేయడం ఆసక్తి. మిత్రులు ఇద్దరు కలిసి 1946లోనే ఉదయభాను అనే మాసపత్రికను ప్రారంభించారు. 1987లో ఎన్టీఆర్ కోరిక మేరకు ప్రాథమిక వీడియో విద్యకు పాఠాలు రూపొందించారు. సాక్షి సినిమాతో 1967లో సినిమారంగంలో ప్రవేశించారు. అది గోదావరి తీరంలోని పులిదిండి, లొల్ల గ్రామాల్లో తీశారు. తర్వాత 1972-74 సంవత్సరాల్లో వీరి సినిమాలకు ఎన్నో అవార్డులు లభించాయి. వీరు తీసిన సినిమాల్లో సీతా కళ్యాణం, ముత్యాల ముగ్గు, భక్తకన్నప్ప, సంపూర్ణ రామాయణం, పెళ్లిపుస్తకం, రాధాగోపాలం చాలా చాలా సినిమాలు జనాకర్షణగా నిలిచాయి. నంది అవార్డులు, జాతీయ అవార్డులు లభించాయి. బాపు రమణద్వయం చివరి సినిమా శ్రీరామరాజ్యం. ●



# 'గాడ్' గారి 80వ జన్మోత్సవ వైభవములు!

**-జనవరి 17, 18, 19 తేదీలందు వెదురుపాక మరొక సంక్రాంతి సందడిగా ఉంటుంది-**

**ఆ** నవ్వు శరత్ పూర్ణిమా సహస్ర చంద్రికల వంటిది. అనురాగ వాత్సల్య జలధి. కరుణాపూరిత జాబిలి! వర్షము వర్షమూ వచ్చేదైనా వర్షవర్షమూ రెట్టింపు హర్షాన్ని కొని తెచ్చేది.

వెదురుపాక ఎంతటి పుణ్యం చేసుకున్నదో! గాడ్‌గారి జన్మదినోత్సవాలకు వెళ్లేవారూ అంత పుణ్యమును మూట గట్టుకుని వస్తారు.

79 ఏండ్ల క్రితమే ఆయన్ను **గాడ్** అన్నారు.

అప్పటికి ఆ ఊరిలో, ఇంగ్లీషు ఒక్క అక్షరం తెలిసిన వారు లేరు.

ఆనాటి వెదురుపాకలో ఇంగ్లీషు '0' పాయింటుకు దిగువనే ఉంది. ఆ యిల్లు ఆ వూరిలో పెద్ద యిల్లు. పూర్వోత్తరపు ఇల్లు వాకిటకి ఇరువైపులా ఎత్తైన అరుగులు. ఆ మధ్య ఎత్తెత్తు చుక్క పర్వతం లాటి మెట్లూ- వాటిని కష్టపడి యెక్కేసరికి గాలిగోపురం లాంటి సింహ ద్వారం. ఇవన్నీ దాటుకుని వెళ్లేసరికి వెయ్యి కాళ్లమండపం లాంటి సువిశాల గృహం – ఓ పెద్ద మండువా లోగిలి అనడం సబబు. పెద్ద పెద్ద హాలు లాంటి గదులు. వీటన్నిటిని దాటుకుని ఒక ఇంగ్లీషు అక్షరం కూడా లోపలికి ప్రవేశించదు.

అలాటి ఇంటిలో ఆ కాలపు కులీన బ్రాహ్మణ వంశంలోని అమ్మమ్మగారు, ఓ 79 సంవత్సరాల క్రితం పుట్టిన తన మనవణ్ణి చూసి 'వీడు గాడ్' అన్నది. అటూ యిటూ ఉన్న అమ్మలక్కలు 'గాడ్' అంటే తమకేదో 'గుడ్' అన్నట్లు తలలు పంకిస్తూ, తలుపులతో పులకిస్తూ 'గాడ్ గాడ్' అంటూ ఒళ్లంతా పులకింతగా పులకించిపోతూ, ముకుళిత హస్తులూ, ముగ్ధమోహనమూర్తులయ్యారు అని – ఆ కాలపు అమ్మ చెప్పింది. – వెదురుపాకలో నేను విడిది దిగిన యింటి పెద్దామె ఆమె.

దశాబ్దముల తరబడిగా- వెదురుపాక గాడ్ గారి గ్రామంగా మార్మోగింది.

అప్పుడు ఉభయగోదావరి గ్రామాల్లోనూ సంస్కృతాంధ్రములే పాలనంగా ఉన్నాయ్. గొంతుచించుకున్నా గ్రామ పొలిమేరకైనా ఇంగ్లీషు అక్షఅపు వాసనలేదు., ఆ యింట్లోని అమ్మగారి నోట **గాడ్**గా పిలువబడినమాట పసిడివాక్కయిపోయింది. వయసులో పెరిగి, విద్యలో పెరిగి- ఉద్యోగం చేసుకుంటున్న ఆ 'గాడ్'గారికి విజయదుర్గాదేవి స్వప్న దర్శనమిచ్చి 'నాలుకపై బీజాక్షరములు' వ్రాసి ఆశీర్వదించడం, ఆయన్ను గృహస్థాశ్రమంలో ఉంటూండే ఋషు తుల్యునిగా వశిష్ట వామదేవులులా ఆయన దినచర్య మారి పోయింది. సాక్షాత్కరించిన దుర్గాదేవి ప్రతిరూప విగ్రహం రూపొం దించి ప్రతిష్టించి యధావిధి పూజలు చేయడం, నిత్యోత్సవాలు, పక్షోత్సవాలు, వార్షికోత్సవాలు అన్న సంతర్పణలు చేస్తూండటము గాడ్ నియమంగా పెట్టుకున్నారు. కుంకుమ ప్రసాదంతో వచ్చే ఆపన్నులకు ముందు భోజనం పెట్టి ఆశీర్వదించడం- ఆయన దినచర్య. ఎంతమంది వచ్చినా భోజనం చేసి వెళ్లాల్సిందే. రాత్రి విజయదుర్గాదేవికి సాత్వికపూజ

ఎవరికైనా యివ్వడమే గాని, దక్షిణలుగా, పూజలుగాను ద్రవ్యం గ్రహించడం లేదు.

**ఆయన గాడ్! ఊరిలోని వారూ, ఊరేతరులూ, సాగరేతరులూ- ఆయన్ను 'గాడ్'గానే పిలుస్తారు. 'గాడ్ గాడ్' అంటూ పరవశిస్తారు. త్రికరణ శుద్ధిగా ఆయన్ను ఆరాధిస్తారు. ఆయన దర్శనం అనుగ్రహంతో పరవశిస్తారు.**

**జనవరి 17, 18, 19 తేదీలలో జరిగే ఆయన జన్మదినోత్సవం బ్రహ్మోత్సవంలా సాగుతుంది. ఎంతోమంది పాల్గొని ప్రసాదం తీసుకుంటూ మూడు రోజులూ పరమా నందం పొందుతారు.**

**సంక్రాంతికివచ్చే యీ మూడు రోజులూ వెదురుపాక గ్రామస్తులకు పండుగలైతే, సంక్రాంతి అనన్తరం వచ్చే జనవరి 17, 18, 19 తేదీలు 'గాడ్' గారిభక్తులకు మహా పండుగలు, వెదురుపాక వారికి బోనస్ పండుగలు.**

**గాడ్‌గారి దర్శనాన్ని పొందడానికీ, గాడ్ గారి ప్రత్యేక ఆశీస్సులు పొందడానికీ- అదృష్టం ఉండాలి.**

# మానుషరూపేణా భగవంతుడు సత్యసాయి భగవానుడు మన రాష్ట్రములోనే జన్మించాడు!



నిజంగా ఆంధ్రులెంతటి అదృష్టవంతులు! ఒక అవతారపురుషుడు అవతరించిన పుణ్యసీమ మనది! పంటలుపండని భూములకు నీరు పారింపచేసాడు. త్రాగడానికి నీరులేని జనుల దాహార్తిని తీర్చాడు. మహిమల్ని చూపాడు. ప్రపంచపటం చూపని పరదేశాల్లో కూడా పరమాత్మునిగా పూజింపబడుతున్నాడు.

ద్వారకా నగరంలో శ్రీకృష్ణుడెన్నో అందమైన భవనాల్ని, భువన సౌందర్యంగా నిర్మింప చేసాడనది విన్నాం. రాయలసీమలో జన్మించిన సాయి భగవానుడెన్నో సుందర భవనాలను నిర్మింప చేసారు. నీతికరమైన విద్య, ధనరహితంగా– ఆధునిక వసతులుగల ఆధునికి వైద్యాన్ని ప్రసాదింప చేసారు. సాంకేతిక విద్యాలయాల వసతులూ కల్పింపచేసిన సాక్షాత్పరమాత్ముడు.

ఆయన ఐతిహాస స్రష్టయిన వ్యాసుడా; రామాయణం కాలంలో రామచరితను వ్రాసిన వాల్మీకియా? భూమినేలిన పృథ్వియా? త్రిమతాచార్య స్వరూపమా? విశ్వంలోని సకల మతములకు చెందిన మతవేత్తా! ఇంజనీరా! సైంటిస్టా, వివేకానందుడా, జగన్నాథుడా! ఎన్నో ఎన్నో మహిమలు గల విద్యారణ్యుడా?

విద్యారణ్యుడేమో! హంపీ విజయనగర శిల్పకళ లుద్దీపింపచేసే భవనాలు నిర్మింపచేయగా సత్యసాయి కృపతో అలాటి భవనాలు పుట్టపర్తిని తీర్చిదిద్దాయ్. ఆంధ్రసీమకు దక్కిన అదృష్టం. ఆంధ్రజనుల పురాకృతఫలం! సత్యసాయీ భగవానుడు మన రాష్ట్రంలోనే అవతరించాడు. ఇవ్వడమే తప్ప పుచ్చుకునే ప్రసక్తి లేనివాడు. ఇదో అవతారం.

కోటాను కోట్లు రూపాయలు యిచ్చి, ఆంధ్ర తమిళనాడు రాష్ట్రాల్లో నీటిపారుదల కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. పెద్ద పెద్ద ఆసుపత్రులను కట్టించారు. హార్టు ఆపరేషన్‌కుగానీ, వాల్వ్‌లు కొనడానికి కానీ ఏ ఛార్జీలు చేయడం లేదు. వారికి సహాయంగా వచ్చిన వారికి వసతి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. బైపాస్ ఆపరేషన్నును కూడా ఉచితంగా చేస్తున్నారు.

పారిశ్రామికులుగానీ, పెద్ద వాణిజ్య సంస్థలు గాని భరించలేని చికిత్సా ఖర్చులు సత్యసాయీ ఆసుపత్రిల్లో ఉచితంగా చేస్తున్నారు. పిల్లలకు నీతివంతమైన విద్యను గురుకుల పద్ధతుల్లో, వసతి భోజనాలతో ప్రభుత్వంగానీ, ధర్మపురుషులుగానీ, అన్యులెవరూ ముందుకు వచ్చి చేయడం లేదు.




తెలుగు భాషా సౌరభ్యం అనన్యం. మాండలికాలుగా – ఆ భాషాయాసలు ప్రాసలు మానసోల్లాసం కలిగిస్తాయ్. తెలంగాణా గేయ సాహిత్యంలో, గద్దర్, గోరేటి వెంకన్న పాటల సౌరభాన్ని ఆస్వాదించి ఉంటాం. ఆ వరుసక్రమంలోనే గూడ అంజన్నగారి బాణీ– వాణిల సౌందర్యం ఆస్వాదిద్దాం.

గూడ అంజయ్య దగ్గరకు వెళ్లంగనే తెలంగాణాకు పట్టు అయిన ఊరు పాట వినబడుతుంది. మళ్లీ 'ఊరు మనదిరా' అన్న పాట శ్రీకాకుళం, జగిత్యాల సిరిసిల్ల పోరాటాల నించి అడవి ఉప్పొంగేలా... మైదానం గజగజ వణికేలా వినవస్తున్నది. 'అరకబట్టె మనం.. ఆ సెలకు దున్నె మనం.. ఈ కంచె కాడ మనం... ఆ కంచె కాడ మనం.. మట్టికాడ మనం. ఆ యెట్టికాడ మనం.. సావుకాడ మనమే.. సన్నాయి కాడ మనమే.. మరి ఈ దోపిడేందిరో... దొరపీకుడేందిరో.. " అన్న పాట మళ్లీ అంజన్న నోట వింటూ వుంటే పక్షవాతం వచ్చి విశ్రాంతి తీసుకున్న 'గూడ అంజన్న' లా లేడాయన. ఉద్యమ సింహంవలె ఉన్నాడు. 'తెలంగాణ వచ్చినంక ఈ కుడిచేయి లేవకపోయిన గని, కాలైనే లేస్తే అట్ల తిరిగొస్తా' అని అంటున్నాడు. ఆ పాట విన్పించినంక ఆయన కొద్దిగా నిమ్మళించిండు. ఇక మాటలు షురువైనవి. మల్ల, మలి తెలంగాణాకు తను రాసిన గేయాల గురించి చెప్పవట్టిండు.

హైదరాబాద్‌లోని రాంనగర్. ఒక చిన్న ఇల్లు. ఫార్మసిస్టుగా ఉద్యోగ విరమణ చేసిన అంజన్న ఆ డ్రాయింగ్ కమ్ రీడింగ్ కమల్ రైటింగ్ రూమ్‌లో ఉన్న బెడ్‌పై నుంచి, పక్కన తన పాటల పుస్తకాలు తోడుగా మాటలాండిండు. పాటలోని తొలి చరణం ఆనందమైతే, మలి చరణం విషాదం అంత సంతోషంగా తెలంగాణ అని రాసుకున్నాక వెంటనే 'నిలువెల్ల గాయాల వీణ' అని రాసిన వైనాన్ని చెప్పిండు. దీనర్థం ఇక్కడి మనుషుల్లోని అమాయకత్వం. దుఃఖం అన్నీ పోయినంక 'బాంచెన్ దొర కాల్మొక్త' అని ప్రాధేయ పడటం, భూమికోసం – భుక్తికోసం – విముక్తి కోసం తరతరాలుగా తండ్లాట.. అందు నుంచే తీవ్రమైన మథనం.. ఆ క్రమంలోనే 'నా తెలంగాణా... నిలువెల్లా గాయాల వీణ' అన్న పాటను పూర్తి చేసిన, అయితే ఇదొక దశ అని వివరించిండు.

'ఎప్పుడైతే తెలంగాణా ఉద్యమం మళ్లీ ఉధృతం అవుతున్నదో అప్పుడు 'ధూంధాం' పేరిట కళాకారులం గ్రామాలను చుట్టిరావడం మొదలైంది. మొదటి సభ కామారెడ్డిలో జరిగింది. అప్పుడే నాకు తట్టింది. అందరం దైన్యమే ఆలపిస్తున్నం గదా అని! ఏడ్చి ఏడ్చే గదా మన తండ్రులు, తాతలు ఆయుధాలు పట్టి సాయుధ పోరాటం చేసింది. ఇంకా ఇప్పుడు గూడ మనం ఏడ్పుడేంది; అనిపించింది. మళ్లీ మళ్లీ పాటల్ని విన్న. ఒక్క పాటనిగాదు. 'పల్లె పల్లెనా పల్లేర్లు మొలిచే తెలంగాణలోన' అన్న సొంటి పాటలే వస్తున్నయి. నా వరకు నాకు దైన్యస్థితిని పాడటం ఒక లోపంగానే ఫీలైన. ఇట్లైతే లాభం లేదనిపించింది. ఆ లోపం నుంచి పాటను పదును పెట్టవలసిందే అని నిర్ణయించుకున్నప్పుడు అప్పుడ **'పుడితొక్కటి సత్తెరెండు... రాజిగ ఓరి రాజిగ'** అన్న పాట రాసిన.

ఈ పాటనే కాదు. మలిదశ ఉద్యమంలో చైతన్యస్ఫోరకమైన పాటల్ని రాయాలని నన్ను నేను మలుపు తిప్పుకున్న. అదంతా ఒక సాధన. ఎవరిది వారికే ఒక పాఠం అన్నట్లు ఆయన చెప్పసాగిండు. "నక్సలైట్ ఉద్యమంలో 'పాట' తుపాకీని పట్టించింది. తెలంగాణా ఉద్యమంలో జెండా కర్రనైనా చేత పట్టించాల్నా వద్దా? ఈ ఆలోచనే, నా చేత 'ఊపు' 'చైతన్యం' 'ఆలోచన' పెంచే పాటల్ని రాయించేలా తర్ఫీదు ఇచ్చింది. ఇకగప్పుడు మొదలైనయి సిసలైన తెలంగాణా ఉద్యమ పాటలు. 'అయ్యోనివా నువ్వు అవ్వోనివా' అన్న పాట రాసిన. అంతకుముందే 'పుడితొక్కటి సస్సె రెండు' అన్న పాట రాసేశిన' అని అంజన్న తెలియజెప్పిండ్రు.

'రాజిగ ఓ రాజిగ' అన్న పాట గురించి ఇంకో మాట చెప్పాలి. 'ఈ పుడితొక్కటి సత్తెరెండు' ఏమిటో కూడా చెప్పాలె. మనం ఒకసారే పుడుతు సస్తె ఒక్కరమే పోతం. కానీ యుద్ధంలో ఉన్నామూ అంటే సస్తె ఇద్దరం సవాలె. అంతేగాని, శత్రువు బతక్కూడదు. చంపైనా వాడితో చావాలి. అంతేగాని ఓటమి, లొంగుబాటు అస్సలు కూడదు. ఈ చైతన్యం పెంచాలనుకున్న. ఈ భావంతోనే ఆ పాట రాసి. గ్రామాల్లో పొలంగట్ట మీ కొట్లాటలు మూమూలుగా జగడలు. అన్నదమ్ములు, పాలోళ్లు ఒకరి మీద ఒకరు ఎంత దాకా పోతారంటే 'గడిసేరు' విరిచి మరీ మీదపడతరు. 'పుడితొక్కటి సస్సె రెండు. ఎయ్‌ర..ఎయ్' బర్సె ఎత్తి పొడుసుకున దాకా పోతరు. ఉద్యమంలో చావో రేవో తెల్సుకునే సమయం ఆసన్నమైనప్పుడు ఇట్లాంటి పాటలు అవసరం.

పాటలో ఉద్యమంలోకి దూకని రాజకీయపక్షాలన్నిటిని అంజన్న ఆనాడు పాటలో గట్టిగానే ఎండగట్టిండు. ఒక రకంగా ఈ పాట అప్పటి తెలంగాణా ఉద్యమంలో రాజకీయ పక్షాల వెనుకబాటుతనాన్నీ పట్టిపీడిస్తుంది. ఒక కాలంలో ఎవరెటు ఉన్నారో సరిగ్గా చూపిస్తుంది. ఆ లెక్కన ఈ పాట ఒక చరిత్ర ఖండిక!

'రాజిగ ఓ రాజిగా' అనడంలో అంజన్న ఇంకొక అడుగును తెలిపిండు. పాట నేరుగా ప్రజల్లోకి వెళ్లడంలోని ఒకానొక రహస్యం. పాటలో 'ఐలపురం రాజిగ' అని 'ఓరుగల్లు రాజిగ' అనీ పాడుతూ చివర్లో 'తెలంగాణ రాజిగ' అంటారు. ఇట్లా ఏ ఊర్లో పాటుకుంటే ఆ ఊర్లోని వ్యక్తిని ఆపాదిస్తూ 'పుడితొక్కటి సస్తె రెండు' అంటూ పౌరుషాన్ని రగిల్చే పాటగా మలిచానని అంజన్న అభిమానంగా చెప్పిండు.

అయితే ప్రజలకు ఉన్న స్పష్టత పాటకు రావాలని, జనం నాడిని పట్టుకునేల ఉంటూనే పాటకు అదనంగా ఒక ఊపునివ్వాలని, మతొతంగా ఈ పాట ఎందుకన్న ఆలోచన చేయిస్తూ, 'ఎత్తుర తెలంగాణా జెండ' అని విశదీకరించే ప్రయత్నమంతా ఆ పాటలో ఉంటుందని చెప్పిండు. 'ఇట్లా ఒక పాటగాడిగా నావంతు ప్రయత్నం చేసిన' అంటాడు.

'పట్టు పట్టు ఉడుంపట్టు... పల్లె పల్లె లొల్లి వెట్టు' అంటూ తెలంగాణా రాకపోతే ఒట్టు' అని చివర్లో పలకడం అంటే ఈ ఊపుతో తెలంగాణా సాకారం కావడం ఖాయం అన్న విశ్వాసం కలిగించడం. ఇట్లా ఒక నమ్మికను కలిగిస్తూ పాటను ముగింపుకు తీసుకెళ్లడం కూడా ఈ పాట ప్రత్యేకత.

నాదీ స్వయాన ప్రశ్నించే స్వభావం. దళిత కుటుంబం నుంచి వచ్చినవాడిని. స్వభావసిద్ధంగానే చిన్ననాటినుంచే అన్యాయాలంటే ద్వేషం ఏర్పడింది. కనుక నేను ఏది రాసినా సూటిగా ఉంటుంది. అందువల్లే 'ఇసుంట రమ్మంటే ఇల్లంతా నాదంటివి' అని సీమాంధ్రులను తప్పుపడుతూ 'అయ్యోనివా నువ్వ అవ్వోనివా' అని ముక్కుమీద గుద్దినట్లు పాట రాసిన. 'పుడితొక్కటి సస్తె రెండు' అని పోరుబిడ్డల రోషాన్ని ప్రకటించిన తెలంగాణా సందర్భం కనుక పౌరుషాన్ని రగిలిస్తూనే. అది ఉజ్వలంగా మండలాంటే దానికి ఇరుసుగా అంతకు ముందరి మనవైన ఉద్యమ చైతన్యాన్ని మళ్లీ పాటల్లో జొప్పించిన' అనీ వివరించిండు. 'ఆ రెండు పాటలేగాదు. నిన్నమొన్నటి మాట. హైద్రాబాద్ కూడా మాకు గావలె అంటుంటే, "కౌన్ కిస్కో సమైక్యాంధ్ర.. బస్‌కరో తేరే తమాషా... తోడ్‌దే తెలంగాణ.. లేలేవురో తలఖ్‌నామా' అంటూ విడాకులు తీసుకొని పొండిరా అని హెచ్చరించిన.

ఒక పరిశీలకుడిగా చెబితే అంజన్నలో ఇంకో సత్యమూ ఉన్నది. విప్లవోద్యమంలో వర్గకసిని పెంచే పాటలు ఉన్నట్లే తెలంగాణా ఉద్యమంలో అంతటి కసిని పెంచే పాటల్ని అంజన్న రాసిండనే అనాలి. (తెలంగాణా యాసతో కూడిన గేయకవి చాతుర్యాన్ని ఎరుకపరచడమే వ్యాసోద్దేశం).



# మద్రాసులోని తొలి తెలుగు కాస్మెటిక్ సంస్థ
# అశోకా శాండల్ పౌడర్

## -95 సంవత్సరాల క్రితం స్థాపింపబడింది-

దోమా వెంకట శేషయ్యగుప్త గారు తొలితరం కాస్మెటిక్ (ఫేసు పౌడర్) వ్యాపారులు.

జేమ్సు పెర్ఫ్యూమరీగా వ్యాపారం ప్రారంభమైంది. 'అశోకా పౌడర్' బ్రాండు విజయా కెమికల్ అండు టాయ్‌లెట్ వర్కుతో ప్రాచుర్యం పొందింది.

టాల్కమ్ (ఫేస్‌పౌడర్) తయారీ రంగంలో శ్రీమాన్ డి.వి. శేషయ్యగుప్తగారే ప్రథమ ప్రధాన పారిశ్రామికులు. మాట కర్కశంగా ఉండేట్టు కనిపించినా లోపల మనసు వెన్న, ఆయన సతీమణి నాగరత్నమ్మ ఆ యింటికి స్వర్ణ రత్నమ్మ.

వారిరువురి వంశోద్ధారక త్రయం నాగేంద్ర ప్రసాద్, సురేంద్రనాథ్ గుప్త, సాయినాథ గుప్త- అశోకా సుగంధ పౌడర్ విలువ పెరిగేట్టు-ఆంధ్ర, తెలంగాణా, సర్కారు జిల్లాల్లోని తమ వ్యాపారాన్ని - ఒకొక్కరు తమ ఏరియాల్లో చేస్తున్నారు.

తండ్రిగారి వంటి ప్రేమమూర్తులు సురేంద్రనాథ్, సాయినాథ్ గుప్తలు, అసమాన ప్రేమమూర్తులు.

సాయినాథ్ (తెలంగాణా - అశోకా) గుప్తతో కుటుంబ సభ్యులు, పెద్ద అల్లుడు జి.ఆర్.టి అనంత పద్మనాభునితో కూడా నాకు అవ్యాజ్యమైన ప్రేమ ఉన్నది.

ఇహ సురేంద్రనాథ్ గుప్త (సర్కారు జిల్లాల అశోకా) గలగల మాట్లాడుతూ, కిలకిలా నవ్విస్తాడు. ఆనందం కలిగించడం, ఆనందం పొందడం- సురేంద్రనాథ్ ప్రత్యేకత. దోమావారి ఈ సోదరుల్లో కాస్మెటిక్ తయారీ నిపుణత్వమును స్వయంగా పరీక్షించుకుంటారు. వారే ఇంజనీర్ కమ్ ఓనర్లు. నాగేంద్రప్రసాద్‌కూ సాయినాథ్‌కూ ఆడపిల్ల (మహాలక్ష్మి)లు. సురేంద్రనాథ్ గుప్త కొక్కరికే మగపిల్లవాడున్నాడు. పేరుకు తగ్గ శ్రీరాముడు.

గోటేటి కోరికపై చి॥ సాయినాథ్ గుప్త పంపిన డి.వి. శేషయ్యగుప్తగారి గురించి తెలియాలనే వ్రాసాను.

(వచ్చే సంచికలో డి.వి. సురేంద్రనాథ్ - సాయినాథ్ గుప్తల ప్రొఫైల్ ప్రచురించగలం)

# భగవద్గీత మనుష్యుల్ని ధార్మికులుగా మారుస్తుంది! గీతా సుబ్బారావు గీతలు మనసుల్నే మారుస్తుంది!!

పాపాయి పత్రిక, పిళ్ళా సుబ్బారావుకు బాగా తెలుసు. అప్పట్నుంచీ ఆయనకు నేను అభిమానపాత్రుడని తరువాత ఆయన చెప్పగా తెలుసు.

ఆయన స్వయంకృషితో పేపర్ డిజైనర్‌గా పేర్గాంచాడు. ఆ రోజుల్లో ప్రసిద్ధ సినిమా పంపిణీ సంస్థలు, పూర్ణా, నవయుగ పిక్చర్స్-ఆదిగా గలవారు ఆయన చేతనే పేపర్ డిజైన్లు చేయించే వారు. ఆయన మద్రాసు వచ్చి పెద్ద పెద్ద నిర్మాతలందర్నీ కలిసేవారు. ఇహ నవయుగ పిక్చర్స్ నరసయ్యగారు, పెద్ద పెద్ద పంపిణీదారులందరికీ ఆయనే తలలోని నాలుక. కానీ ఆ నాలుక తలబిరుసుతనాన్ని లేకుండా చేసింది; తలెత్తుకు తిరిగేట్టు చేసింది. సినిమా పంపిణీదారుల కార్యాలయ స్థానం గాంధీనగర్‌లో పూర్ణాపిక్చర్స్ ప్రక్కనున్న భవనాన్ని పూర్ణంగా, వాసానికీ కార్యాలయానికీ తీసుకున్న ఘనుడా భూసురుడు (ఈ మాటకు పెద్దన్నగారు కాపీరైట్‌హోల్డర్. ఆయన లేరన్న ధీమాతో ఈ పదాన్నుపయోగించాను. నిజానికీ పదం కూడా ఆయన్ను గురించి చెప్పడానికి తగను.)



ఏ పూర్వపుణ్యమో ఈ పొందుగా మారీ- అన్న సినిమా పాటలా - మా ఇరువురి స్నేహమూ, వాత్సల్యమూ పెరుగుతూ వచ్చింది.

ఆయన పూర్తి పేరు పిళ్లా సుబ్బారావుశాస్త్రి. 1948లో కార్తీక పూర్ణిమరోజున విజయనగరంలో పుట్టారు. పిళ్ళా వెంకటరత్నం, విశ్వనాథం వారి తల్లిదండ్రులు. ఏడో ఏటనే సుబ్బారావు విజయవాడ వచ్చారు. స్కూల్ ఫైనల్ చదివారు. అరిపిరాల సత్యనారాయణ మంచి టీచరు. చాలా క్రమశిక్షణ పాటించేవారు. ఫ్యాక్టరీకి దగ్గరగా వుంటుందని లించిపేటలో వుండేవారు. హరిజనులు, ముస్లింలు ఎక్కువగా వుండే ఏరియా. పాఠాలతోపాటు అరిపిరాల మాస్టర్‌కు ప్రతిరోజూ 'ఆంధ్రప్రభ' తెచ్చి, వార్తలు చదివి వినిపించేవారు. సుబ్బారావు అంటే ప్రత్యేక అభిమానం. ప్రతీ ఏడాది ఏసీసీ కంపెనీవారు వేసే పంచాంగం వారికి గురుదక్షిణగా ఇచ్చేవారు. అప్పట్లో ఎలిమెంటరీ స్కూలు అడ్మిషన్ ఫీజు 50 పైసలు. ఆయన ఇంట్లో కూడా 'ఆంధ్రప్రభ' వస్తూండేది. చైనా యుద్ధ సమయంలో పేపరు దొరికేది కాదు. ఇప్పట్లా ఎక్కడ పడితే అక్కడ పేపర్లు అమ్మేవారు కాదు. అది కావాలంటే రైల్వేస్టేషన్‌కు వెళ్లాలి.

అప్పట్లో మద్రాసు మెయిల్‌లో పేపర్లు వచ్చేవి. యుద్ధం రోజుల్లో పేపరు హెడ్డింగ్‌ను ఎర్ర అక్షరాలతో ప్రచురించేవారు. ఐదుగంటలకల్లా స్టేషన్‌కు వెళ్లి ఎలాగో ఆయన పేపరు తెచ్చేవారు. అప్పుడే వాసు, శామ్యూల్ వేస్తుండే కార్టూన్లు మీద అభిమానం కలిగింది. వాటి కోసం పేపరు చూడటం ఆయనకు అలవాటయింది. వాటి స్ఫూర్తితోనే స్కెచ్‌లు గీస్తుండేవారు. అవి పిచ్చిగీతల్లా కనిపించినా విచిత్రమైన బొమ్మలుగా కనిపించేవి. అలా 'గీతం నాడి' చిన్ననాటే గమనించానని ఆయనంటూండే వారు. ఓ టీచర్ పిల్లల జేబుల్లో వున్న అర్ధణా, అణా తీసుకుని టిఫిన్, కాఫీలు తెప్పించుకునేవారు. "బాలప్రభ" అనే వ్రాతపత్రికను పెట్టి 'బళ్లో టీచర్ల కబుర్లు - పిల్లల జేబుల్లో డబ్బు స్వాహా' అనే హెడ్డింగ్‌తో వార్త రాశారు. అది చూసి హెడ్మాస్టర్ మెచ్చుకుని ఆ టీచర్‌ను తిట్టారు. ఇలా గీతా వారు క్లాసులో పేరు తెచ్చుకున్నారు. గొప్ప కార్టూనిస్టయ్యారు. ●

# అన్యాయార్జితమైన ద్రవ్యంతో యజ్ఞయాగాలు చేసినా ఫలితమివ్వవు!

పాండవులు రాజసూయాన్ని ద్విగ్విజయంగా చేసారు. బ్రాహ్మణులందరికీ భూరిదక్షిణలిచ్చారు. సంతర్పణలు చేసారు. జనసందోహం వచ్చింది. ఘనంగా సంతోషించింది.

సాక్షాత్తు పరంధాముడైన శ్రీకృష్ణుడు వచ్చి పూజలందుకుని వెళ్ళాడు. యజ్ఞం పూర్తయింది. యజ్ఞఫలం సిద్ధించే సమయంలో, ధర్మరాజు పాలనం చిరకాలం జరిగి, పాండవులు చిరస్థిరమైన కీర్తిని సంపాదించారు. ఖజానా నిండుగా ద్రవ్యార్జన చేసారు. మయుడు వచ్చి చక్కని మహల్ను నిర్మించాడు. మూడు నెలలు కూడా వారా ఆ రాజమహల్‌లో వాసం చేయలేదు.

జూదజాడ్యంగల ధర్మరాజు జూదంలో ఓడిపోయాడు. ద్రౌపది కౌరవులచే పరాభవింపబడింది. ద్రౌపదిని నిండుసభల్లో జుట్టుపట్టి ఈడిస్తుంటే కళ్ళప్పగించి చూసారు. అందరూ రాజమహల్ని విడిచిపెట్టి అడవుల పాలయ్యారు. వేదమంత్రాల ప్రభావం ఏమయ్యింది. సాధు మునివరేణ్యుల ఆశీస్సులేమయ్యాయ్.? సాక్షాత్పర మాత్ముడే వచ్చి పూజలందుకున్నాడే! ఏఁవిటీ ధర్మవిపర్యం? వేద మంత్రాలు వ్యర్థ ఫలాల్నిచ్చాయా? రాజసూయంలో వారు సంపాదించిన ధన కనక వస్తువాహన రాశులన్నిటినీ రాజులను కొల్లగొట్టి తీసుకుని వచ్చినవే. ఆర్జితమైన ద్రవ్యమంతా అన్యాయార్జితం! న్యాయార్జితం, స్వార్జితం కాదు.

రాజుల్ని కొట్టి తెచ్చిన ధనం బెడిసికొట్టింది. గర్వస్వభావంతో సంపత్ప్రదర్శనం చేసారు. మంచి మనసు లేకుండా సంకల్పించిన మంత్రాలు తంత్రాలే అవుతాయ్. ఎవరి తలల్నో పగులకొట్టి- ప్రగల్భాలకు పోతే పాండవుల్లా రాజ్యభ్రష్టత్వం కలుగుతుందని పరమాత్ముడే సంకల్పించాడేమో! ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై
044 25204046, 26171341








# ఈ జలనిధి మనదీ!

ఏడు దశాబ్దాల క్రితం, బ్రిటిష్ అధికారులు కలకత్తా నుంచి తరలించుకుపోతున్న అపారమైన వెండినిల్వలు సముద్రం పాలయ్యాయి. వాటిని వెలికితీసే ప్రయత్నం. ఒప్పందాల ప్రకారం.. బ్రిటన్ ప్రభుత్వ వాటా ఇరవై శాతం, వెలికితీసే ఒడిస్సీ సంస్థ వాటా ఎనభైశాతం. మరి. సొంతదారులైన భారతీయుల సంగతి ఏంటిటో తెలియలేదు.

సముద్రంపాలయిన వెండిని గుట్టలుగా పోస్తే (వెండి) కొండ అవుతుంది. ఇటుకల్లా పేరిస్తే శ్వేతసౌధాన్ని తలపిస్తుంది. కరిగిస్తే పాలసంద్రమై ప్రవహిస్తుంది. లెక్కేయడం మొదలుపెడితే, అంకెల నెన్నుకోవాల్సిందే. ఆ అపార సంపద 70 ఏళ్లుగా సముద్రగర్భంలోనే మగ్గిపోతుంది. ఖజానాల్లో భద్రంగా ఉండాల్సిన వెండిరాశులు సముద్రంపాలయ్యాయి? అదంతా ఎవరి సొత్తు? బయటికి తీసే మార్గం లేదా? సొంతం చేసుకునే ఉపాయం లేదా? చరిత్ర తెలుసుకోవాలంటే డెబ్బై ఏళ్లు వెనక్కి వెళ్ళాలి. తెల్లదొరల వాణిజ్య రాజధానియైన మన కలకత్తాలో ఆ కథ మొదలవుతుంది.

**డిసెంబరు 5, 1940, కలకత్తా నౌకాశ్రయం :**

భారతదేశంలోని అతిపెద్ద నౌకాశ్రయం కలకత్తా. భారత్ నుంచి బ్రిటిష్ పాలకులు తరలించుకుపోయే అపార సంపదకు అది తొలి మజిలీ. గెయిర్‌సొప్పా వాణిజ్య నౌక కొద్దిక్షణాల్లో బయల్దేరడానికి సిద్ధంగా ఉంది. ముడి ఇనుము, తేయాకు తదితర సరకుల్నీ అప్పటికే ఎక్కించడం జరిగింది. ఆ మాత్రం లావాదేవీలకయితే అంత హడావిడి అవసరం లేదు. అంతమంది అధికారులు రావాల్సిన పన్లేదు.

ఓ బ్రిటిష్ ఉన్నతాధికారి గెయిర్‌సొప్పాలో ఎక్కించిన సరకుల చిట్టా జాగ్రత్తగా పరిశీలించారు

ముడి ఇనుము – 2600 టన్నులు

తేయాకు – 1765 టన్నులు

జాబితా చివర్లో..

వెండి – 219 టన్నులు

దానికితోడు కొంత బంగారమూ ఉంది.

లెక్కలకు ఎక్కినవీ, ఎక్కనివీ.. అంతా కలిసి మొత్తం ఏడువేల టన్నుల సరుకు. ఒక్క వెండి విలువే, ఆరులక్షల పౌండ్లు నోటిలెక్కలు వేసుకున్నాడా అధికారి ఆ నిధి నిక్షేపాల్ని సురక్షితంగా బ్రిటన్‌లోని లివర్‌ఫషూల్‌కు చేర్చాలి ఆ ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండాలని ప్రత్యేకమైన ఆదేశాలు అందాయి. అందులోనూ, రెండో ప్రపంచ యుద్ధ సమయం. శత్రువులు ఏ వేపు నుంచి అయినా తరుముకు రావచ్చు. సంపదంతా దోచుకుపోవచ్చు. అదే జరిగితే?... బ్రిటిష్ అధికారికి చెమటలు పట్టాయి. నౌకపరిస్థితి ఎలా ఉంది? ఇంత సరకు మోయగలదా? సురక్షితంగా గమ్యానికి చేర్చగలదా? మరమ్మతులేమైనా ఉన్నాయా? మనసు నిండా సందేహాలే!

అన్ని 'డౌటింగ్ థమస్' అని ముద్దుగా విసుక్కుంటారు. సహోద్యోగులు 'షర్! గెయిర్‌సొప్పా చరిత్ర మీకు తెలిసే ఉంటుంది. శత్రుదుర్భేద్యమైంది' వినయంగా జవాబిచ్చాడు చీఫ్ ఆఫీసర్ కుమింగ్స్.

'ఎస్ ఎస్.. ' అంటూ తలూపాడు. అయినా ఏవో అనుమానాలు. కీడు జరుగబోతోందన్న భయం. ఎందుకైనా మంచిదని, సిబ్బంది వివరాల్నీ ఒకసారి పరిశీలించాడు. మొత్తం ఎనభైమూడుమంది. అందులో ఆంగ్లేయులున్నారు. భారతీయులన్నారు. భారతీయుల్లో అన్ని మతాలవారు ఉన్నారు. అంతా అనుభవజ్ఞులే. రక్షణగా ఇద్దరు సాయుధుల్ని కూడా పంపుతున్నారు. కెప్టెన్ అనుమతి ఇవ్వగానే.. గెయిర్‌సొప్పా బయల్దేరింది. ఆత్మీయులూ, బంధువులూ ఒడ్డున నిలబడి చేతులు ఊపుతున్నారు.

'వెళ్లగానే ఉత్తరం రాయ్'

'ఆరోగ్యం జాగ్రత్త'

'గాడ్ బ్లెస్ యు మై చైల్డ్'

'హ్యాపీ జర్నీ'

బంధాల్లోని గొప్పతనమే అది.

**ఫిబ్రవరి 17, 1941, అట్లాంటిక్ సముద్రం**

అపారమైన వెండి నిక్షేపాల్ని మోసుకెళ్తున్న 'గెయిర్‌సొప్పా' నౌకకు భారత్‌తో చాలా అనుబంధం ఉంది. పేరులోనే కన్నడ కస్తూరి గుబాళిస్తుంది. బ్రిటిష్ ఇండియా స్టీమ్ నావిగేషన్ కంపెనీ 1919లో దీన్ని తయారుచేసింది. నిజానికి, నావికాదళాల కోసం రూపొందించారు. ఆ విభాగంలో పెద్దగా అవసరం లేకపోవడంతో రెండు మూడు నెలల్లోనే వాణిజ్య కార్యకలాపాలకు మళ్లించారు. ఎరుపు –నలుపుచారలు. ఇనుపకవచం.. ఆహుందాతనమే వేరు.ఎన్ని ఓడల మధ్యనిలబెట్టినా, ఇట్టే గుర్తుపట్టేయొచ్చు. గెయిర్‌సొప్పా భారతీయనామం. కర్ణాటకలో గెయిర్‌సొప్పా (గెరుసొప్పే అని కూడా పిలుస్తారు). అనే చారిత్రక ప్రదేశం ఉంది. వేల సంవత్సరాల క్రితం ఇక్కడ జైనమతం విరాజిల్లింది. సాళువ పాలకుల హయాంలో ఓ వెలుగు వెలిగింది. ఆ తర్వాత తెల్లవారి ఆధీనంలోకి వెళ్లి పోయింది. ఆ పరిసరాల్లోనే బ్రిటిష్ అధికారుల విడిది ఉండేది. దగ్గర్లోనే ఉన్న జోగ్ జలపాతాన్ని చూసి తీరాలి! తెల్లదొరలకు ఆ ప్రకృతి సౌందర్యం అంటే చాలా ఇష్టం. తరచూ వచ్చేవారు. జోగ్ జలపాతాన్ని విడిది పేరుతో గెయిర్‌సొప్పా జలపాతమని పిలిచేవారు. ఆ ప్రేమతోనే వాణిజ్య నౌకకు నామకరణం చేశారు. దాదాపుగా ఇరవై ఏళ్లు ఆ నౌక తెల్లదొరల వాణిజ్య వ్యాపారాలకు ఉపయోగపడింది. చాలా దేశాలు చుట్టొచ్చింది. భారత్ – ఇంగ్లాండ్‌ల మధ్య ఎన్నోసార్లు ప్రయాణించింది.

కొద్ది రోజుల్లోనే ఒడ్డుకు చేరుకుంటామన్న ఆనందం! అంతలోనే సముద్రంలో కల్లోలం. ఉపద్రవం ముంచుకొస్తున్నసంకేతాలు. ఆ నౌక దారితప్పింది. ఎటెళ్లాలో తెలియని అయోమయంలో, ఇంధనమంతా ఖర్చయిపోయింది. గెయిర్‌సొప్పా ఆవిరితో నడిచే నౌక. బొగ్గు నిల్వలు నిండుకోవడంతో ఏం చేయాలో పాలుపోలేదు. గమ్యాన్ని చేరుకోవడం అసాధ్యమని అర్థమైపోయింది. 'గాల్వే హార్బర్ దగ్గర్లోనే ఉన్నట్టు అనిపిస్తోంది. ఉత్తరం వైపు వెళ్దాం..' ఓ నిపుణుడు సలహా ఇచ్చాడు. మరో దార్లేదు. ఆ వైపుగా నడిపించారు. అంతలోనే అలజడి శత్రువులు.. శత్రువులు..జర్మన్ యుద్ధనౌక (యు–బోట్ 101) పద్నాలుగు జలాంతర్గాములతో 26 మైళ్లతో.. మృత్యువులా దూసుకొచ్చింది.

సిబ్బంది పరుగులు తీశారు. హాహాకారాలు చేశారు. ఎవరికివారు ప్రాణాల్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. లైఫ్‌బోట్స్ సాయంతో బయటపడాలనుకున్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంది. తప్పించుకోవడం అసాధ్యం. అయినా ఆశ. బతకాలన్న ఆరాటం. తుపాకుల మోత. బుల్లెట్ల వర్షం. అక్కడికక్కడ ఎంతమంది చనిపోయారో చెప్పడానికి ఆధారాల్లేవు. ఏ ఆయుధాన్ని పట్టినవాడు, ఆ ఆయుధంతోనే పోతాడంటారు. యుద్ధనౌకగా ప్రాణం పోసుకున్న గెయిర్‌సొప్పా.. మరో యుద్ధ నౌక చేతిలో సర్వనాశనమై మునిగిపోయింది. ఆ మునిగిన నౌకనిండా వెండే!

# సంగీత సాహిత్య ప్రతిభామూర్తి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

సంగీత సాహిత్య రంగాలలో గొప్ప పండితుడిగా, ఆధునిక తెలుగు వాఙ్మయ చరిత్రలో గొప్ప పరిశోధకుడు, విమర్శకుడుగా రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ తెలుగువారందరికీ సుపరిచితులు. ఆయన బహుముఖ ప్రజ్ఞా సంపన్నుడుగా, సంగీత సుధాకరునిగా, సాహిత్య భాస్కరుడిగా, అపూర్వ ప్రతిభా సమన్వితునిగా, మేధావిగా, సౌమ్యునిగా, సహృదయుడిగా కీర్తిగడించారు.

అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం తాలూకాలోని రాళ్ళపల్లి వారి స్వగ్రామం. రాళ్ళపల్లి 1893 జనవరి 23న జన్మించారు. తల్లి ఆలివేల మంగమ్మ, తండ్రి కృష్ణమాచార్యులు.



చిన్నతనంలో 12 సంవత్సరాల దాకా తండ్రి వద్దనే సంస్కృతాంధ్ర భాషలలో సంప్రదాయ శిక్షణ పొందారు. పిదప మైసూరు వెళ్లి కృష్ణ బ్రహ్మతంత్ర పరకాల యతీంద్రుల మహాపురుషుని దగ్గర అంతేవాసిత్వం వున్నారు. అప్పుడే మైసూరు మహారాజా కళాశాలలో ఆచార్యుడిగా వున్న ప్రముఖ కవిపండితులు డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డిగారితో పరిచయమయింది. ఆ పరిచయం ఆయన జీవితంలోనే గొప్పమలుపు తిరిగిందని ఆయన సమకాలీనులు చెప్తారు. కట్టమంచి రామలింగారెడ్డి 1912 ప్రాంతంలో మైసూరు మహారాజ కళాశాలలో రాళ్లపల్లిగారికి తెలుగు పండితునిగా అవకాశం కల్పించారు. మహారాజా కళాశాలలో రాళ్ళపల్లి తెలుగు పండితునిగా మూడున్నర దశాబ్దాలు పన్జేసారు. తన వ్యక్తిత్వం ఇంత మనోహరంగా తీర్చిదిద్దినది కట్టమంచిగారి సహచర్యమేనని అంటారు. సాహిత్య సంస్కారమున నాకు ఆయన కడపటి గురువు, నా దృక్పథం మారడానికి, ప్రత్యేకంగా తిక్కనపై నాకింత అభిమానం ఏర్పడడానికి ఆయనే ప్రధాన కారణం అని రాళ్లపల్లి పలు పండిత సభలలో పేర్కొన్నారు.

1911లో రాళ్లపల్లి 'తారాదేవి' ఖండకావ్యం ఆనాటి ప్రముఖ పత్రిక 'సరస్వతి' ప్రచురించడంతో రాళ్ళపల్లివారి సాహిత్యసేవకు శ్రీకారం చుట్టినట్లయింది. ఆ తర్వాత మీరాబాయి (పద్యవాక్యములు), లీలాదేవి (కల్పితగాథ) సారస్వతోపన్యాసములు, నాటకోపన్యాసములు, వేమన, శాలివాహన గాథా సప్తపతి (సంస్కృతంలో 400 పద్యాలను తెలుగులో అనువదించారు) స్పర్ధాకావ్యము (సంస్కృతము)– ఇలా పలు సాహితీ గ్రంథాలను ఆయన వెలువరించారు.

లీలాదేవి : ఇది బెంగాలీ ఆధారిత నవలను కన్నడం నుంచి తెలుగులోకి రాళ్లపల్లి అనువదించారు. కవి వేమన గురించి రాళ్ళపల్లి వారి విమర్శనాత్మక ఉపన్యాసాలు ఆనాటి సాహిత్య రంగంలోని ప్రముఖులను ఉర్రూత లూగించాక్షీ్. చిన్నతలంలో తన తల్లి ప్రోత్సాహంతో సంగీతంలో అభిరుచి కలిగింఇ. ఆ తర్వాత బండారు కృష్ణప్ప వంటి అగ్రశ్రేణి కర్ణాటక సంగీత ప్రముఖుని శిష్యరికం ద్వారా శాస్త్రీయ గాత్రం, వయొలిన్ సాధన చేసారు. కర్ణాటక సంగీత రంగానికి ఆయన ఎనలేని సేవను చేశారు. మరుగున పడి వున్న తాళ్లపాక అన్నమాచార్యుని అనేక సంకీర్తనలను వెలికితీసి, వాటికి అమూల్యమైన పీఠికలు రాసి, స్వరపరచి, సంగీతాభిమానులకు అందుబాటులోకి తెచ్చారు. అన్నమయ్య కీర్తలను తన స్వరకల్పనలతో ఆయన గానం చేస్తుంటే ఏడుకొండలు పైనున్న శ్రీవెంకటేశ్వరుడే దిగి దివ్యక్షేత్రం దిగి శ్రోతల కన్నుల ముందు ప్రత్యక్షమవుతున్న అనుభూతి కలుగుతుందని ఆయన అభిమానులు చెప్పారు. 1950 ప్రాంతంలో తిరుపతిలో శ్రీవెంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయంలో సుమారు ఏడేళ్లపాటు అన్నమయ్య తాళ్లపాక వాగ్గేయకళాకారులందరి కీర్తినల పరిశోధనలతో ఆ కీర్తనలకు స్వరకల్పనలతో రాళ్ళపల్లి తెలుగు సంగీత సంప్రదాయానికి ఎనలేని సేవ చేసారు. రవీంద్రనాథ్ ఠాగూర్ 1917లో మైసూర్ సందర్శించినప్పుడు, అప్పుడు అక్కడే వుంటున్న రాళ్ళపల్లి ప్రదర్శించిన తన అద్భుత జ్ఞాపకశక్తి పట్ల అబ్బురపడిన కవీంద్రుడు I can imagine how this young pundit follows me with notations అని కొని యాడారని ఆయన శిష్యులు ఎంతో గొప్పగా చెప్తారు.

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రథమ కర్ణాటక సంగీత సమావేశంలో ఆయనను 'గాన కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కరించారు. అలాగే మైసూరు సంగీత పరిషత్తు ఆయన్ని 'గాన కళాబంధు' బిరుదుతో సన్మానించి గౌరవించింది. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ అన్నమయ్య కీర్తనలు సుమారు 800 పైచిలుకు స్వరకల్పన చేయగా, వాటిని తిరుమల తిరుపతి దేవస్థానం రెండు సంపుటాలుగా గ్రంథస్తం చేసి విడుదల చేసింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డి.లిట్ పట్టాతో రాళ్లపల్లిగారిని సత్కరించింది. తిక్కనను గాఢంగా అభిమానించే రాళ్ళపల్లి తిక్కన వల్లనే తెలుగువారికి వ్యాసుని గొపస్పదనం తెలిసిందనేవారు. వాల్మీకి రామాయణం స్థాయిని ఎవరూ అందుకోలేరనేవారాయన.

తన సంగీత, సాహిత్య ప్రతిభా సంపదతో ఎందరో్ని మంత్రముగ్ధుల్ని కావించిన రాళ్ళపల్లి 1979 మార్చి 11న తుది శ్వాస విడిచారు.

**(మల్లాది కృష్ణానంద్‌కు కృతజ్ఞతలు)**

Beautiful City - Beautiful Hotel



DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

# జగంలో యెక్కడా జరుగని జగన్నాథ రథయాత్ర

*జగాన్ని సృష్టించిన జగన్నాథుడు సోదర సోదరిలతో 'పూరి'లోనే వెలిసాడు. భగవన్మూర్తుల విగ్రహాలను రథాల్లో ఊరేగించడం దైవికాచారం. మూల విగ్రహాలను మూడు రథాల్లో ఊరేగించడమనేది 'పూరి' క్షేత్రంలోనే ఉన్నది. పూరీ జగన్నాథ రథయాత్రను చూడడానికి ప్రపంచం నలుమూలల్నుంచీ వస్తారు.*

సృష్టికర్తను సృష్టించినవాడికిక్కడ ప్రాణప్రతిష్ఠ జరగడం విడ్డూరం. ఎంత వింత మహిమాన్వితం! విగ్రహాల తయారీ పూర్తయి తర్వాత వాటికి పూజలు నిర్వహిస్తారు. శ్రీకృష్ణుడు అవతారం చాలించిన (దేహత్యాగం చేసిన) రోజు అదేనంటారు. శ్రీమందిరంలో జరిగే ఈ ప్రక్రియ అత్యంత రహస్యం... నియమనిష్ఠామయం. మొదట దేవాలయ మంతా శోధించి, లోప లెవరూ లేకుండా చూస్తారు. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర, సుదర్శనుల నూతన విగ్రహాలను తెప్పించి, అంతవరకూ పూజలందుకుంటున్న మూర్తులు ముందుంచుతారు. 'బ్రహ్మ' మార్పునకు ఎంపిక చేసిన నలుగురు దైతాపతుల కళ్లకు ఏడు పొరలుగా పట్టువస్త్రాన్ని కడతారు. అలాగే చేతులకూ, కళ్లకూ కూడా చుడతారు. అర్ధరాత్రి కాగానే, మందిరంలో దీపాలు ఆర్పేస్తారు. ఆ నలుగుర్నీ మాత్రమే ప్రధాన మందిరంలోకి అనుమతిస్తారు. వారు కటిక చీకటిలో కళ్లకు గంతలు కట్టుకుని శ్రీమందిరంలో ఉంటారు. ఎవరెవరు ఏయే దేవుని బ్రహ్మపదార్థాన్ని మార్పు చేయాలో అప్పటికే నిర్దేశించి ఉంటారు. ఆ మేరకు వారు ఆయా దేవతామూర్తుల వద్దకు నాభి ప్రాంతంలోని బ్రహ్మపదార్థాన్ని జాగ్రత్తగా తీసి కొత్త విగ్రహాల్లో ఉంచుతారు. జాజిపూలు, కస్తూరి, చందనం, తులసి తదితర ద్రవ్యాలతో బ్రహ్మ పదార్థాన్ని నూతన విగ్రహాలతో ఉంచి బొడ్డుదగ్గరున్న ద్వారాన్ని మూసేస్తారు. దీంతో బ్రహ్మపదార్థ మార్పిడి పూర్తవుతుంది. ఆ సమయంలో పూరీ పట్టణమంతా విద్యుత్తు సరఫరా ఆపేస్తారు. నూతన దారుదేవతా మూర్తుల్లో బ్రహ్మపదార్థాన్ని నింపగానే వాటికి 'నవకళేబర' ప్రాప్తి లభిస్తుంది. అనంతరం పాత మూర్తులను ముక్తిమండపం దగ్గరున్న కైవల్య వైకుంఠంలో భూస్థాపితం చేస్తారు. ఆ సందర్భంగా శుద్ధక్రియ, కర్మకాండలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలు పదకొండు రోజులు జరుగుతాయి. పదకొండో రోజు శ్రాద్ధభోజనం చేస్తారు. ప్రాచీన విగ్రహాలకు సంబంధించిన కార్యక్రమాలు ఇంతటితో ముగుస్తాయి. ఆ 'బ్రహ్మం' ఏమిటన్నది బ్రహ్మరహస్యం!

## జగన్నాథ రథచక్రాల్..

రథయాత్రకు రెండు రోజులు ముందుగా అమావాస్యనాడు, నూతన దేవతా మూర్తుల నేత్రోత్సవం జరుగుతుంది. యథావిధిగా పూజలు మొదలవుతాయి. మరుసటి రోజు ప్రజలకు నవయ్వన దర్శనం లభిస్తుంది. ఆషాఢ శుక్ల విదియనాడు పొందాలు మేళతాళాలతో ఉదయకాల పూజలు నిర్వహించి 'మనిమా' (జగన్నాథా..) అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ విగ్రహాల్ని కదిలిస్తారు. ఆనందబజారు, అరుణస్తంభం మీదుగా అత్యంత కోలాహల వాతావరణంలో ఊరేగిస్తూ రథం వెనక భాగం నుంచి తీసుకువచ్చి, రత్నపీఠం మీద అలంకరింప జేస్తారు. ఈ ఉత్సవం 'పహండీ'. ఆ దశలో కులమత భేదాలకు తావుండదు. గుండిచా ఆలయానికి వెళ్ళేం దుకు సిద్ధమైన సుభద్ర, జగన్నాథ, బలభద్రులు రథారూఢులై ఉండగా... ఇలపై నడిచే విష్ణువు'గా గౌరాభిమానాల్ని అందుకునే పూరీ రాజు పల్లకీలో అక్కడికి చేరుకోవడంతో సంరంభాలు మిన్నంటుతాయి. పర మాత్ముని ముందు సేవకుడిగా మారిన ఆ



మహారాజు బంగారపు చీపురుతో రథాల లోపల ఊడుస్తాడు. దీన్నే 'చెర పహారా' అంటారు. కస్తూరి కళ్లాపి జల్లి హారతిచ్చి.. 'జై జగన్నాథా' అని నినదిస్తూ ఆయన రథానికున్న తాళ్లను లాగడంతో ప్రపంచ ప్రఖ్యాత రథయాత్ర మొదలవుతుంది. ఇదే 'గుండిచాయాత్ర' 'ఘోషయాత్ర' అనీ అభి వర్ణిస్తారు. ఆ సమయంలో స్వామిని 'పతిత పావనుడు' అంటారు. ఆ క్షణం కోసమే ఎదురుచూస్తున్న లక్షలాది భక్తులు ఒక్కసారిగా రెట్టించిన ఉత్సాహంతో ముందుకు దూకుతారు. మిన్నుముట్టే జయజయధ్వానాల మధ్య రథాలు భారంగా కదలుతాయి. సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి చేరుకోవడానికి 12 గంటల సమయం పడుతుంది. గుండిచావనానికి చేరుకున్నాక, ఆ రాత్రి ఆలయం బయటా రథాల్లోనే మూలవిరాట్టులకు విశ్రాంతినిస్తారు. మర్నాడు ప్రొద్దున మేళతాళాలతో గుడిలోపలికి తీసుకువెళతారు. స్వామి అక్కడ ఏడురోజుల పాటూ ఉంటాడు. ఐదో రోజున ఓ ఆసక్తికరమైన విశేషం జరుగుతుంది. ఆలయం లోకి తనతోపాటు తీసుకెళ్లలేదని స్వామి అలిగిన లక్ష్మీదేవి, గుండిచా గుడి బయటినుంచే జగన్నాథుని ఓరకంట దర్శించి, పట్టలేని కోపంతో స్వామి రథాన్ని కొంతమేర ధ్వంసం చేసి వెనక్కి వెళ్లిపోతుంది. ఈ ముచ్చట అంతా అమ్మవారి పేరిట పూజారులే జరిపిస్తారు. ఆ రోజు 'హీరాపంచమి' అంటారు. వారంపాటు గుండిచాదేవి ఆతిథ్యం స్వీకరించిన సుభద్ర, జగన్నాథ, బలభద్రులు దశమినాడు తిరుగు ప్రయాణం చేస్తారు. ఇది 'బహుదాయాత్ర' అంటారు జగన్నాథుడు మాత్రం 'అర్ధాసని' ('మౌసీమా'గా ప్రసిద్ధి' గుడి దగ్గర ఆగి తియ్యటి ప్రసాదాల్ని ఆరగిస్తాడు. మధ్యాహ్నానికి మూడు రథాలూ ఆలయానికి చేరుకుంటాయి. తరువాత రోజు, ఏకాదశినాడు స్వామివార్లను బంగారు ఆభరణాలతో (సునావెష) అలంకరించి దర్శనానికి అనుమతిస్తారు. ఆ దృశ్యం అద్వితీయం. ద్వాదశినాడు మళ్లీ విగ్రహాలను రత్నసింహాసనంపై ప్రతిష్ఠించడంతో రథయాత్ర పూర్తవుతుంది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి నవయవ్వన రూపాన్ని దర్శించుకుని "జై జగన్నాథ! జై జగన్నాథ!" అంటూ స్వామినే మనసంతా నింపుకుని భక్తజనం తిరుగుముఖంపడతారు. జగత్తులో యెక్కడా ఇలాటి రథోత్సవం జరుగదు.



# రౌడీల కల్లా రౌడీ! రంగూన్ రౌడి వీడే!

## -దొమ్మేటి రౌడీ వీడే! రంగూన్ రౌడీ వీడే-

రంగూన్ రౌడీ నాటకాన్ని మా చిన్నతనంలో యెక్కడ ప్రదర్శింపబడినా పడి పడి వెళ్లి చూచేవాళ్ళం. పౌరాణిక నాటకాలకు ధీటుగా ప్రదర్శింపబడిన నాటకం. రచయిత ఎవరో వినికిడి లేదు. ఆనాడు ప్రతీ తెలుగు నాటకానికీ రచయిత పేరును తాటికాయంత ప్రమాణంలో వ్రాసేవారు. పద్యనాటకాలకే ప్రాచుర్యముండేది.

రంగూన్ రౌడీలో పద్యమూ, పాట ఉన్నా పరిమిత స్థాయిలోనే ఉండేది. ఆ రెండూ వంద పద్యాలూ, పాట స్థాయికన్నా పెద్దగా, పదే పదే నోట పలికేటట్లుండేవి.

అసలు రంగూన్ యెక్కడుండేదో, అక్కడ రౌడీలు ఉండేవారో, లేదో– అదంతా ఊహకు అనవసరమైన విషయం. పద్యనాటకాలొక్కటే తెలుగునేల వెలుగుతున్న రోజుల్లో తెలుగు నాటక రంగస్థలాన్ని ఒక ఊపు ఊపాయ్.

దొమ్మేటి సూర్యనారాయణ– దమ్ముండే ప్రతినాయక వేషాలు వేయడంలో గట్టివాడు. ఆయనకు ఈ 'రంగూన్ రౌడీ' నాటకంపై అపూర్వమైన ఆసక్తి కలిగింది. ఒళ్లును జలదరింప చేసే రౌడీ పాత్ర. ఒక రకంగా జలంధరుడే అనుకోండి (తులసీ జలంధర సినిమా చూచినవారికి జలంధరుడెంతటి భీకరుడో తెలుస్తుంది, అలాటి భయంకరమైన పాత్రను 'రంగూన్ రౌడీ' నాటకంలో రంగరించి పెట్టారు. దాన్ని బాగా సానపట్టి, కత్తులవలె మెరుగులు పెట్టి– దొమ్మేటి సూర్యనారాయణగారు 'రంగూన్ రౌడీ'గా రాణించి సవాలు చేసినట్లు– రౌడీల కల్ల రౌడీ! రంగూన్ రౌడీ వీడే– దొమ్మేటిరౌడీ– అంటూ నాటకాన్ని, తన పాత్రను ప్రాచుర్యంలోకి తీసుకునివచ్చారు.

పాండవోద్యోగ విజయాలు, గయోపాఖ్యానమూ, పాదుకాపట్టాభిషేకం నాటకాల స్థాయికి ఈ నాటకాన్ని తీసుకుని వెళ్లారు.

దొమ్మేటి సూర్యనారాయణగారి తరువాత దొమ్మేటి సత్యనారాయణగారు 'రౌడీ' పాత్ర ధరించి, నాటక స్థాయిని నిలబెట్టారు.

దొమ్మేటి సూర్యనారాయణగారిని రౌడీ పాత్రను ధరింపచేస్తూ, సినిమా నిర్మించి నట్లు నాకో జ్ఞాపకం. ఆ నాటకాన్ని పోలిన 'నాటకాలు' యెన్నో వచ్చినా– ఆ నాటకం స్థాయి– ఆ నాటకానిదే తప్ప మరో నాటకానికి రాలేదు. అటు తరువాత సినిమా నటుడు రాజారెడ్డి– కావలిలో ఆ నాటకం ప్రదర్శిస్తూ, నన్ను తీసుకునివెడితే చూసాను. పేకేటి, కమలకుమారి (అప్పటి జయంతి పేరు) ఆ నాటకంలో నటించారన్నది మరో జ్ఞాపకం. ఆ నాటకం ఇంతకీ యెలా పుట్టిందోనని ప్రశ్నించుకుంటే....

'రంగూన్ రౌడీ' నాటకకర్త సోమరాజు రామానుజరావు (జూన్18, 1896–నవంబర్14, 1934). ఆ నాటకాన్ని ఆయన రంగూన్‌లో ఉండగానే వ్రాసారు. విజయవాడలో అమ్మమ్మగారి ఇంట పుట్టిన రామానుజరావు స్వస్థలం ఆనాటి ఖమ్మం జిల్లా దుమ్ముగూడెం. ఉద్యమస్ఫూర్తితో వ్రాసిన రచనలు బ్రిటిష్ ప్రభుత్వం ఆగ్రహానికి గురైనాడు చైతన్యమూర్తి రామానుజరావు. బాల్యం, విద్యాభ్యాసం భద్రాద్రిలోనే సాగించిన రామానుజరావు తన గ్రామంలో 'శ్రీవేంకటేశ్వర గ్రంథ మండలి' పేరిట ప్రచురణ సంస్థను నెలకొల్పారు. ఆరేళ్ల కాలంలోనే 20కి పైగా నవలలు అందించిన ప్రతిభాశాలి ఆయన. 18వ ఏటనే భద్రాచలంలోని రాజవీథిలో 'భరతమాత' చిత్రపటంతో ఊరేగి ప్రభుత్వ ఆగ్రహానికి గురైనారు. ఆయన రాసిన 'స్వరాజ్యరథం' నాటకం కూడా శ్వేతజాతి ప్రభుతకు కోపం తెప్పించింది. నిషేధానికి గురైంది. మరిన్ని విపరిణామాలు సంభవించకుండా రామానుజారావు తల్లిదండ్రులు (చూడా మణి, కోదండరామయ్య) ఇతర కుటుంబ సభ్యులు రహస్యంగా ఆయనను రంగూన్ పంపించారు. స్టీమర్‌లో సామాను ఉండే గదిలో దాక్కుని ఆయన ప్రయాణించారు. అప్పటికి రెండేళ్ల క్రితమే 23వ ఏట ఆయనకు లంకపల్లికి చెందిన కొండపల్లి సీతమ్మతో వివాహమైంది. 1922 చివర రంగూన్ చేరుకున్న రామానుజ రావు అక్కడ 'తెలుగు' అనే పత్రికను, ఆనంద ప్రచురణాలయాన్ని స్థాపించారు. దేశభక్తే ప్రధానంగా ఆయన రచనలు చేశారు. అప్పుడే రంగూన్ రౌడీ నాటకం రాశారు. దీనిని నిషేధించడానికి కూడా ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ నాటకం పేరుమీద మాత్రమే ఆంక్షలు విధించింది. దానితో 'పతిభక్తి' పేరుతో దీనిని ప్రదర్శించారు. సతీ అనసూయ, ద్రౌపది, దానవీరశూరకర్ణ వంటి పౌరాణిక నాటకాలు కూడా ఆయన రచించారు. రచనా వ్యాసంగంతో జీవితమంతా గడిపిన రామానుజ రావు కేవలం రెండేళ్లు కాపురం చేసి రంగూన్ వెళ్లిపోయి భారతదేశం తిరిగి రాలేదు. స్వాతంత్ర్య భానూదయం చూడకుండానే అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన కన్నుమూసినప్పటికీ రంగూన్ రౌడీ నాటకం వందల కొలదీ పట్టణ గ్రామాల్లో ప్రదర్శింపబడింది. రచయితకు మరణం లేదని రూఢీ చేసింది. ●

# ప్రకృతిని రక్షిస్తే మనల్ని ప్రకృతి రక్షిస్తుంది!

## చల్లని నీళ్లల్లో ఏ కన్నులు దాగెనో! వెచ్చని గ్రీష్మంలో ఏ గుండెలు పగిలెనో!

స్పర్శాజ్ఞానం ఉంటేనే స్పందన కలుగుతుంది. ప్రకృతి ఈ రెండిటినీ ప్రసాదిస్తుంది. ఒక్కొక్కమారు దారుణ ప్రతాపం చూపిస్తుంది. 'ప్ర' అంటే గొప్పది, ఉన్నతమైనది. భిన్న చైతన్యం గలది, దివ్యత్వాన్నుద్దీపింప చేసేది. చైతన్యం ఒకటిగా ఉండదు. ఉండాలనుకోవడంతో తాపప్రతాపాలు ఉత్పన్నమవుతున్నాయ్.

ఏకం అనేకం కావడమే ప్రతీపత్వం అంటున్నారు. ఈ ప్రతీపత్వాన్ని వ్యతిరేకమూ అంటున్నారు. ప్రస్తుత వాతావరణమంతా ప్రతీపత్వంగానే సాగుతున్నది. ప్రకృతీ ధర్మాన్నెవరూ పాటించకపోవడమే ప్రతీపత్వానికి కారణమవుతున్నది.

ప్రకృతిని వికృతం కావించడమే వికారత్వం. ప్రకృతి దివ్యత్వాన్ని కోల్పోవడంలో మనిషి కారణమవుతున్నాడు. మబ్బు ముసకేసినప్పుడు, మంచు దుప్పటి కప్పేసి నప్పుడూ, నల్లిక్కులా మౌనం క్రమ్మేసినపుడూ, నీలం వర్ణంతో నింగి నేలా, జలావృతమైన సరస్సుల్లో– ననసన్నంగా ఓ సంగీతం వినిపిస్తుంది; దానికి 'సరిగమపదనిస' వరుసక్రమం ఉండదు; ఆరోహణం ఉండదు? అవరోహణం ఉండదు? అపశ్రుతి ఉండదు.

పాంచభౌతికమైన ప్రకృతిని మనిషి పాంచభౌతికమైన శరీరంతో నెదుర్కొనే ప్రయత్నాన్ని అనవతరమూ చేస్తున్నాడు. అనవర్థములను కొని తెచ్చుకుంటున్నాడు.

ప్రకృతి అందమైనది, ఆనందం కలది. అనంత సుఖములను ప్రసాదించునది. కాలానుగుణ్యంగా వచ్చునది. ప్రాణాధారణమైన నీరు, నింగి నుంచీ వర్షింపబడుతుంది. నేలను గిచ్చితే నీరు లభిస్తుంది. కృత్రిమంగా మేఘాలను సృష్టించీ పాతాళము కంటే బోరులు వేసి నీటి నుత్పన్నం చేసుకోవాలని తలచడం వారి తలలను వారే తెగ నరుకు కోవడమే.

జీవనదులను కాలుష్యం గాకుండా కాపాడుకోవాలి.

మనకెన్నో జీవనదులు సరిపడు జలాలు నిస్తున్నవి. గంగ, గోదావరి, కృష్ణ, యమున ఆదిగా గల నదులను పవిత్ర నదులుగా, నదీమాతలుగా కొలుస్తున్నాం. నిత్య సంధ్యాహారుతులనిస్తూ, ఘనంగా నదీ పుష్కర మహోత్సవాలను, మహోత్సాహంగా జరుపుకుంటున్నాం. కానీ ఏ నదినీ కాలుష్యరహితం చేసుకోలేక పోతున్నాం. నదీ తీరాల్ని బహిర్ప్రదేశాలుగా ఉపయోగిస్తుంటే, కొందరు పురపాలక సంఘములు వారు కుళ్లునీటిని విడిచిపెడుతున్నారు. పారిశ్రామికులు ఏసిడ్సు నిండిన నీళ్లను విడిచిపెడుతున్నారు.

ఎంతో పవిత్రత సంతరించుకున్న గంగానది నీరు ఎంతగా కశ్మలమవుతున్నదీ కాశీ నుండి చూడవచ్చు. సగం కాలిన శవాలనే గాకుండా, వాటిపై చల్లుతూ తీసుకుని వచ్చిన ఆకులు, అలములు, వాడిన పుష్పాలు వంటివన్నీ గంగలోనే కలుపుతున్నారు. మురుగు కాలువల నీరును కూడా గంగలోకే విడుస్తున్నారు.

ప్రత్యక్షంగా చూసిన ప్రధాన మోడీ గంగా ప్రక్షాళనం ప్రారంభించారు. ప్రభుత్వంతో ప్రజలు సహకరిస్తేనే ఈ 'ప్రక్షాళనం' సాగుతుంది. ఒకసారి పుష్పగిరి పీఠాధీశులు స్వామివారితో గంగా స్నానమునకు వెళ్లాను. మోకాలి నీరుకూడా లేకపోవడంతో పడవలో నదీ మధ్యకు వెళ్లి స్నానాలు చేసాం. గంగానది మధ్యనంతా ఇసుక తిప్పలు వేసింది. గంగానదే యిలా ఉంటే – ఇతర నదులు యెలా ఉంటాయో యోచించండి. ప్రయాగలోని త్రివేణీ సంగమము వద్ద స్నానానికి వెళ్లినప్పుడు కూడా ఇదే అనుభవం కలిగింది. జీవనదుల పవిత్ర జీవాన్ని మనమే కలుషితం చేస్తున్నామని గ్రహిస్తారనే విన్నపం జేస్తున్నాం. ●

జి.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

# భారతభూమి నా మహోన్నత స్వర్గం, భారతీయమే నా ఆశయం!

\- స్వామి వివేకానంద



## భారతదేశానికి, భారతీయులకు సహనం నశించిందా;

గత 8 నెలలుగా ఇది దేశంలో జరుగుతున్న చర్చ, ఈ చర్చ ఎక్కువగా హిందువులు కాని వారి నుంచి, మేము మేధావులము అని చెప్పుకునే నాస్తికవాదుల నుంచి వచ్చింది. వీరికి వంత పాడడానికి కొందరు పత్రికాధినేతలు, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలు తోడయ్యాయి.

## భారతీయులు అసహనపరులా?

మన చరిత్ర చూసుకుంటే ఇంతవరకూ మిగిలినవారు మనమీద దండయాత్రలు చేసారేగానీ మనము అంటే భారతదేశం ఇంతవరకూ ఎవరిమీద దండెత్తినట్లు చరిత్ర లేదు. మన హిందువుల పురాతన దేవాలయాలైన కాశీ, మధుర, సోమనాథ్ దేవాలయాలను ధ్వంసం చేసారు. అవి ఇప్పటికీ అలానే వున్నాయి. అయోధ్యలో రాముడి విగ్రహాలను బయటవుంచి పూజలు చేస్తున్నాం. ఇది అందరికీ తెలిసినదే. కొన్ని వందల సంవత్సరాలుగా ఇది అందరికి తెలిసిన నగ్న సత్యం. మనదేశంలోని ముస్లిములు బాబ్రి మసీదును హిందువులు కూల్చారని దానికే దేశం ఇలా అట్టుడికి పోతోందని ఒక వాదన. ఒకటి అక్కడ ప్రార్థన జరగటం లేదు ముస్లిములు ఎవరూ లోపలికి వెళ్ళటం లేదు. మొత్తం భారతదేశమంతా కొలిచే దేముడు రాముడికి దేవాలయం కట్టకుండా అడ్డుకున్నారు. కనీసం మనం ఆ విగ్రహాలను బయటపెట్టి పూజచేస్తున్నాం. కానీ మసీదులో ఇంతవరకూ ప్రార్థన జరిగినట్టు లేదు. దానికోసం ప్రభుత్వం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంది. ఎన్ని రకాలుగా వారికి రాయితీలు ప్రకటించింది. ఇంత జరిగినా హైకోర్టు తీర్పు ఇచ్చినా సుప్రీంకోర్టు వరకు వెళ్ళారు. కాని పోనీలే అని విడిచిపెట్టారా? హిందువులు మెజారిటీగా వుండే దేశం, అయోధ్య రాముడు జన్మించిన రాజ్యం అక్కడ గుడి వుండడం సమంజసం అని ఎవరైనా భావించారా? ఆ ప్రక్కనే మనం మన స్థలంలో మసీదు కట్టుకుందాం. గుడి, మసీదు ప్రక్క ప్రక్కన వుంటే సమరస భావంతో వుండాలని ముందుకొచ్చారా? అదీ లేదు. పోనీ ఇవన్ని ప్రక్కనే పెట్టేయ్యండి. 1984లో సిక్కులు గురుద్వారా అమృత్‌సర్ బంగారుగుడిలో కాస్త అలజడి జరిగింది. వారి పవిత్రస్థలం కాస్త దెబ్బతింది. అల్లర్లు జరిగాయి. ప్రాణ నష్టం జరిగింది. ఇరువైపు సిక్కుల పెద్దలు మాట్లాడుకున్నారు. ఒప్పందం కుదుర్చుకున్నారు. చక్కగా గురుద్వారాను మళ్లీ పూర్వవైభవంతో పునర్నిర్మించారు. ఏదో ఒకటి రెండు తక్క అల్లర్లు పెద్దగా లేవు. ఏం అలా మీరు నడుచుకోకూడదా? ఒక్క బాబ్రీ మసీదును కారణం చూపిస్తూ ఎన్ని అల్లర్లు, ఎందరి ప్రాణాలు హరించారు. ఎంత ఆస్తి నష్టం చేసారు. బాంబే అల్లర్లు, రైళ్ల బాంబులు, మార్కెట్లలో బాంబులు, మొన్న తాజ్‌హోటల్ ధ్వంసం, సరిహద్దులో మా సైనికులు ఎంతమందిని ఘాతుకంగా హతమార్చారు? గుజరాత్ అల్లర్లకు మూల కారణమేమిటి? గోద్రా రైలు బోగీలో రామభక్తులను హతమార్చటం కాదా? అయినా సహిస్తూనే వున్నాం, సహనం పాటిస్తూనే వున్నాం. మా దేశంలో పాకిస్థాన్ జెండాలు ఎగురవేస్తూ మమ్మల్ని రెచ్చగొట్టారు. అయినా సహించాం. ప్రస్తుత ప్రధానమంత్రిని ఎన్ని రకాలుగా ఇబ్బంది పెట్టారు. గుజరాత్‌లో ఆయనమీద ఎంత దుమారం లేపారు. దేశవిదేశాల్లో NGOల సాయంతో ఎంత గొడవులు సృష్టించారు. దేశం పరువుని ఎంత అప్రతిష్టపాలు చేసారు. అయినా 2002 నుంచి మూడు ఎలక్షన్లలో ఆయనను గుజరాత్ ప్రజలు ఎన్నుకున్నారు. దేశం అంతా గమనించింది. ఆయన సమర్థత అందరికి నచ్చింది. ఆ పార్టీ ఆయన్ను ప్రధాన మంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తూ 2014 ఎలక్షన్లు ఎదుర్కొంది. దేశం మొత్తం ఆయనకు బ్రహ్మరథం పట్టింది. 20 ఏళ్ల తరువాత ఒక పార్టీ పూర్తి మెజారిటీ ప్రభుత్వం ఏర్పరచుకుంది. దేశవిదేశాలు ఆయనలోని సమర్థతను, నిజాయితీని గుర్తించాయి. టీకొట్టు నుండి 120 కోట్ల జనుల నాయకుడిని చేసాయి. ప్రతి దేశం ఆయన్ను సాదర హృదయంతో సొగరవంగా ఆహ్వానించాయి. స్నేహహస్తం అందించాయి. స్వదేశంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇవ్వడం ప్రారంభించాయి. సరిగా ఇప్పుడు మీ అసహనం బయటపడింది. మోడి అనే పేరు మారుమ్రోగిపోవడంతో మీలో విపరీతమైన అసహనం ఏర్పడింది. అయిదేళ్లు ఆయన వుంటే దేశం బాగుపడిపోతుందని అసూయ ఎక్కువైపోయింది. దేశం భగ్గున మండి పోతే అందులో చలి కాచుకుందాం అని అనుకున్న వారికిదంతా మింగుడుపడడం లేదు. ఎప్పుడూ మన దేశంలో రాజద్రోహులు, దేశద్రోహులు వుంటూనే వున్నారు. వారు పరాయి వాళ్లతో మన స్వాతంత్ర్య సంగ్రామంలోనే మన నాయకులను మట్టుబెట్టించారు. మరి అల్లూరి సీతారామరాజు, ఝాన్సీలక్ష్మీ బాయి, వీరపాండ్యకట్ట బొమ్మన్, భగత్‌సింగ్, వీరసావర్కర్ వీరందరూ ఇలా బలైనవారే కదా! అలాగే ప్రస్తుత నాయకులు ఒక వర్గంతో చేరి భారతదేశాన్ని అగౌరవపరచాలని, అనిశ్చితి కలుగజేయాలని కంకణం కట్టుకున్నారు. వారి అసహనాన్ని దేశ అసహనంగా చిత్రీకరించారు. ఇచ్చిన అవార్డులను తిరిగి ఇవ్వడం మీడియా ద్వారా దుష్ప్రచారం చెయ్యడం భారతదేశమంటే ఏమాత్రం విశ్వాసం, గౌరవంలేని షారుక్‌ఖాన్‌లు, అమీర్‌ఖాన్‌లు వాటికి తోడవ్వడం చాలా బాధాకరం. ఇది వెన్నుపోటు.

ప్రస్తుతం అమీర్‌ఖాన్ విషయానికి వద్దాం. ఆయన కొన్ని వందల కోట్లు ఈ అసహనపరులైన భారత ప్రజల నుండే సంపాదించాడు. ఆయనకు బ్రహ్మరథం పట్టి గొప్ప హీరో (ఆయన ముస్లిము అని చూడకుండా)ని చేసింది ఈ అసహన పరులైన భారతీయులే. భారతీయులు అసహనపరులు, ఇక్కడ వుండడం భయంగా వుంది అని ఆయన భార్య కిరణ్‌రావు చెప్పినట్టు చెప్పి, చక్కగా నవ్వుతూ మీడియాలకు, ఫోటోలకు ఫోజులిస్తూ ఆయన పర్సనల్ సెక్యూరిటీ కాకుండా సహనపరులైన భారత ప్రభుత్వం ఆయనకి అదనపు పోలీసు బలగంతో సెక్యూరిటీ ఇచ్చింది. ఇది ఇంక ఏ దేశంలోనూ జరుగదు. ఆ మాటకొస్తే వేరే దేశం అయితే ఈపాటికి ఆయన్ని అరెస్ట్ చేసేవారేమో కూడా. భారతీయులు అనాదిగా సర్వే జనాసుఖినోభవంతు, లోకా సమస్త సుఖినోభవంతు (లోకం అంటే ప్రపంచం) అన్నారే కాని, హిందువులు మాత్రమే బాగుండాలని చెప్పలేదు. మా దేశాన్ని మీరు అగౌరవపరిచారు. ఇక్కడ వుండడం భయంగా వుందన్నారు. 120 కోట్ల భారతీయులను అవమానపరిచారు.

## అమీర్‌ఖాన్ గారికి కొన్ని ప్రశ్నలు

ఆయన జవాబివ్వడని తెలుసు, అయినా అడగడం తప్పటం లేదు.

1. అయ్యా ఇక్కడ నుండి ఏ దేశం వెళ్లాలనుకుంటున్నారో మీ భార్యని అడగండి.
2. బొంబాయి అల్లరు కానీ, తాజ్‌హోటల్ అల్లర్లలో కాని సరిహద్దులో ఇద్దరు సైనికుల మొండెములు పట్టుకుని తిరిగిన టెర్రరిస్ట్‌లను కాని మీరు ఇంతవరకూ ఖండించలేదు.
3. ఒకసారన్నా పాకిస్థాన్ ప్రభుత్వాన్ని మీరు కాశ్మీర్‌లో మారణహోమం చెయ్యకుండా ఆపండి అని చెప్పగలిగారా?
4. స్వాతంత్ర్యం వచ్చాక పాకిస్థాన్‌లో హిందూ జనాభా తగ్గిపోవడానికి భారతదేశంలో ముస్లింల జనాభా పెరిగిపోవడం ఎలా జరుగుతుందో అన్వేషించారా;
5. ఢిల్లీలో వున్న కాశ్మీర్ పండిట్ల దగ్గరకు వెళ్లి, వాళ్లను ఎందుకు కాశ్మీరం నుండి తరిమారో కనుక్కున్నారా?

ఇప్పటికే మా దేశం మీద బురదజల్లారు. మీ భార్య మాటలు గౌరవించి ఆవిడకు ప్రపంచంలో అత్యంత ప్రమాదరహితమైన దేశమేదో కనుక్కుని అక్కడకు వెళ్లే ప్రయత్నం చెయ్యండి. అంతేకాని తిన్నింటి వాసాలు లెక్క పెట్టకండి.

## నమ్మక ద్రోహం చెయ్యకండి.

భారతీయులు అమాయకులు గాంధీగారు, గౌతమ బుద్ధుడు మాకు సహనం, ఓర్పు అంటూ మంచితనం అనబడే పిరికితనాన్ని నూరిపోశారు. ఆ మాట మీరన్నందుకు మీరు నవ్వుతూ వున్నారు. మేము కుమిలి కుమిలి పోతున్నాం. ●

అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్ధ, వృద్ధ భారాన్ని మోస్తూనే

అఆ



**251 నెలలుగా**
**251 సంచికలను**

శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।

# ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల ఱేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యథోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)



గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు


చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
December 2015

REGN. No. TN/CC(S)DN/177/15-17
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97



GOTETI GRAPHICS
FOR COMPLETE PRINTING SOLUTIONS

- Offset printing
- Desk top publishing
- Prepress
- Postpress

Office : #64 (#16), Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. INDIA. ☎ 91-44-2474 2091
Telefax : 91-44-23716322 e-mail : gotetigraphics@gmail.com